
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
మంగళవారం 14 అక్టోబరు 2025



పాఠశాలలకు కొత్త టీచర్లు

విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులు సుమారు 90 శాతం వరకు సోమవారం విధులకు హాజరయ్యారు. కొత్త టీచర్లకు ఈనెల మూడో తేదీ నుంచి శిక్షణ ఇచ్చారు. ఆ రోజు నుంచే సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకున్నారు. శిక్షణ అనంతరం కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలు కేటాయించిన విద్యా శాఖ, సోమవారం నుంచి విధులకు హాజరుకావాలని సూచించింది. ఏజెన్సీలో పోస్టింగ్ పొందిన టీచర్లు చాలా వరకు ఆదివారమే ఆయా మండల కేంద్రాలకు చేరుకున్నారు.



నగరంలో వర్షం

విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఉదయం పది గంటల వరకూ వర్షం కురిసింది. భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. కొన్నిచోట్ల రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు. మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు కోస్తాలో ఎక్కువచోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది.

పొదుపు సొమ్ము స్వాహా చేసిన నకిలీ ఆర్పీ

- కలెక్టర్‌కు సంఘం ఫిర్యాదు

విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అక్కయ్యపాలెం (44వ వార్డు)లో నకిలీ రిసోర్స్ పర్సన్ ఒకరు తమ సంఘానికి చెందిన సొమ్ములు స్వాహా చేశారని కనకమహాలక్ష్మి పొదుపు సంఘం ప్రతినిధులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 2020 అక్టోబరులో తమ సంఘం ఏర్పాటుచేశామని, ఆ సమయంలో యూసీడీ నుంచి నియమితులైన ఆర్పీనని ఒక మహిళ వచ్చి కార్యకలాపాలు పర్యవేక్షించడం

... మిగతా 6వ పేజీలో

అతీగతీ లేని అదానీ డేటా సెంటర్

ఆరేళ్ల క్రితం భూమి కేటాయింపు

రూ.14,634 కోట్ల పెట్టుబడులు పెట్టి, 24,990 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ

- ఇప్పటికి రెండుసార్లు శంకుస్థాపనలు
- పది నెలల క్రితం పర్యావరణ అనుమతులు
- ప్రస్తుతం ప్రహరీ గోడ నిర్మాణానికే పరిమితం
- పనులు ఎప్పటికి మొదలయ్యేనో...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గూగుల్ డేటా సెంటర్, రైడెన్ డేటా సెంటర్, సిఫీ డేటా సెంటర్...ఇప్పుడు మారుమోగుతున్న పేర్లు. కానీ ఆరేళ్ల క్రితమే విశాఖపట్నంలో డేటా సెంటర్ ఏర్పాటుకు అదానీ సంస్థ ముందుకువచ్చింది. ఆ ప్రాజెక్టుకు రెండుసార్లు శంకుస్థాపన జరిగింది. అయితే అనుమతులన్నీ మంజూరు చేసి రెండేళ్లు గడుస్తున్నా పనులు ముందుకుసాగడం లేదు. ఇప్పుడు తాపీగా ఆ భూమికి ప్రహరీ నిర్మిస్తున్నారు. ఇక అసలు పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో?



అదానీ డేటా సెంటర్‌కు కేటాయించిన కొండ ప్రాంతం

అదానీ డేటా సెంటర్ నిర్మాణానికి తెలుగుదేశం ప్రభుత్వం 2019లోనే భూమి కేటాయించింది. ఆ ప్రాజెక్టుకు అదే ఏడాది ఫిబ్రవరిలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ఒప్పందం రద్దు చేసింది. తమకు దీర్ఘకాలిక ఒప్పందాలు నప్పవని, వెంటనే ప్రాజెక్టు పూర్తి చేయాలంటూ మధురవాడ హిల్ నంబరు 130 ఎకరాలు కేటాయించింది. అప్పట్లో ఎకరా 15 కోట్ల రూపాయల విలువచేసే భూమిని ఏపీఐఐసీ ద్వారా కోటి రూపాయల చొప్పున ఇచ్చింది. దీని కోసం అదానీ సంస్థ 'వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్' అని స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేసింది. ఏపీఐఐసీ వేసిన ఈ లేఅవుట్‌కు వీఎంఆర్‌డీఏ వెంటనే అప్రూవల్ ఇచ్చింది.

ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్‌కు ఒప్పందం

ప్రభుత్వం కేటాయించిన భూమిలో ఇంటిగ్రేటెడ్ డేటా సెంటర్ ఏర్పాటుచేస్తామని అదానీ యాజమాన్యం ప్రకటించింది. డేటా సెంటర్‌తో పాటు బిజినెస్ పార్క్ నిర్మిస్తామని పేర్కొంది. దశల వారీగా రూ.14,634 కోట్ల పెట్టుబడుల పెట్టి, 24,990 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపింది. మొదట 200 మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ పెడతామని ప్రకటించింది. ఆ తరువాత మరో 100 మెగావాట్లతో మరో డేటా సెంటర్ నిర్మిస్తామని పేర్కొంది. కేటాయించిన భూమిలో 82 ఎకరాల్లో 200 మెగావాట్ల డేటా సెంటర్, 28 ఎకరాల్లో ఐటీ బిజినెస్ పార్క్, 11 ఎకరాల్లో స్కిల్ యూనివర్సిటీ నెలకొల్పుతామని ఒప్పందం చేసింది.

ఎస్‌పీవీ...ఆ తరువాత జాయింట్ వెంచర్

డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్‌ను రెన్యువబుల్ ఎనర్జీ ద్వారా సమకూర్చుకుంటామని ప్రకటించింది. అదానీ గ్రూపు విద్యుత్ రంగంలో భారీ పెట్టుబడులు పెట్టడంతో విద్యుత్‌కు ఇబ్బందులు ఉండవని ప్రభుత్వం భావించింది. డేటా పంపింగ్ కోసం సముద్ర అంతర్భాగం నుంచి సబ్‌మెరైన్ కేబుల్ తీసుకువచ్చి, ఆగ్నేయ ఆసియా దేశాలకు కనెక్టివిటీ పెంచుతామని తెలిపింది. వైజాగ్ టెక్ పార్క్ పేరుతో ఎస్‌పీవీ పెట్టి, తరువాత 'అదానీ కనెక్స్' జాయింట్ వెంచర్‌కు వెళుతున్నట్టు ప్రకటించింది. మాట మార్చేసి తొలుత 100 మెగావాట్ల డేటా సెంటర్ పెడతామంటోంది.

ఈ ప్రాజెక్టుకు ఈ ఏడాది జనవరిలోనే పర్యావరణ అనుమతులు లభించాయి. ఈ భూమి కంబాలకొండ సెన్సిటివ్ జోన్ పరిధిలో ఉండడం వల్ల 30 మీటర్ల పరిధిలో గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేయాలని షరతు పెట్టారు. కేటాయించిన భూమిలో కొన్నిచోట్ల అనుమానాలు ఉన్నాయని చెప్పడంతో ఆరు నెలల క్రితమే విశాఖ గ్రామీణ తహశీల్దార్, సర్వే విభాగం కలిసి వెళ్లి వారి భూమిని అప్పగించారు. ఇప్పుడు తీరుబడిగా ఆ భూమికి

... మిగతా 6వ పేజీలో

వందే భారత్ రైళ్ల నిర్వహణ ఇక్కడే...

మర్రిపాలెంలో రూ.300 కోట్లతో డిపో ఏర్పాటు

- ప్రస్తుతం విశాఖ నుంచి నాలుగు వందేభారత్ రైళ్లు
- రాబోయే రోజుల్లో మరిన్ని వచ్చే అవకాశం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో వందే భారత్ రైళ్ల మెయింటెనెన్స్ డిపో ఏర్పాటుకు అడుగులు ముందుకు పడుతున్నాయి. మర్రిపాలెంలో రూ.300 కోట్లతో అవసరమైన పనులు చేపట్టనున్నట్టు రైల్వే అధికారి ఒకరు తెలిపారు. భారతీయ రైల్వేలో అత్యధిక వేగంతో నడిచే రైళ్లలో వందేభారత్ మొదటి స్థానంలో ఉంది. వీటికి ప్రయాణికుల నుంచి ఆదరణ కూడా అధికంగా ఉంది. వీటి సంఖ్య పెంచడానికి, కొత్త మార్గాల్లో వీటిని నడపడానికి రైల్వే మంత్రిత్వ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. చెన్నైలో వీటి నిర్మాణం వేగవంతం చేస్తోంది. ప్రస్తుతం విశాఖపట్నం నుంచి నాలుగు వందే భారత్ రైళ్లు నడుస్తున్నాయి. విశాఖపట్నం-సికింద్రాబాద్‌ల మధ్య రెండు అంటే...ఇటు నుంచి ఒకటి, అటు నుంచి ఒకటి ఏకకాలంలో నడుస్తున్నాయి. విశాఖపట్నం నుంచి దుర్గ్‌కు మూడోది, విశాఖపట్నం నుంచి భువనేశ్వర్‌కు నాలుగోది వెళుతున్నాయి. వీటిలో సికింద్రాబాద్‌లో మధ్యాహ్నం బయలుదేరి రాత్రి 11 గంటలకు విశాఖపట్నం చేరుకునే వందే భారత్ రైలుకు ఇక్కడ విశాఖలోని కోచ్ మెయింటెనెన్స్ డిపోలోనే నిర్వహణ పనులు చేస్తున్నారు. మిగిలిన మూడు రైళ్లకు ఆయా ప్రాంతాల్లోనే నిర్వహణ పనులు జరుగుతున్నాయి. వీటికి స్పేర్ పార్ట్స్ (విడి భాగాలు) ఏమైనా అవసరమైతే చెన్నై నుంచి తెప్పించి బిగిస్తున్నారు.

ప్రత్యేక డిపో ఉండాల్సిందే

సాధారణ రైళ్లకు నిర్వహణ పనులు చేపట్టాలంటే కనీసం ఎనిమిది గంటల సమయం పడుతుంది. అదే వందే భారత్ రైలుకు అయితే కనీసం 10 గంటలు అవసరం. దీనికి ప్రత్యేకమైన 'పిట్ లైన్' నిర్మిస్తారు. దానిపై రైలును నిలిపితే సిబ్బంది కిందన పిట్‌లైన్‌లోకి వెళ్లి మరమ్మతులు చేస్తారు. విశాఖపట్నం జోనల్ కేంద్రంగా మారిన నేపథ్యంలో ఇక్కడి నుంచి మరిన్ని వందేభారత్ రైళ్లు భవిష్యత్తులో నడిచే అవకాశం ఉంది. ఇక్కడి నుంచి తిరుపతికి ఒక రైలు త్వరలో వచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ముందుగానే నిర్వహణ డిపో ఏర్పాటుచేస్తున్నామని రైల్వే అధికారులు చెబుతున్నారు.మర్రిపాలెంలో అవసరమైన భూమి ఉన్నందున రూ.300 కోట్లతో పనులు చేపట్టనున్నట్టు ఉన్నతాధికారి తెలిపారు.

నిషేధిత దగ్గు మందు స్వాధీనం

... మెయిన్‌లో

- రూ.4.5 లక్షలు విలువజేసే 5,900 సిరప్‌లు గుర్తింపు

వర్క్ ఇన్‌స్పెక్టర్లే కాంట్రాక్టర్లు!

బినామీ పేర్లతో టెండర్లు

ఏళ్ల తరబడి ఒకేచోట తిష్ఠ

- క్షేత్రస్థాయిలో పనులు పర్యవేక్షించని ఏఈలు
- జీవీఎంసీ ఇంజనీరింగ్‌లో మాయ
- పలువురు వర్క్ ఇన్‌స్పెక్టర్లపై అధికారులకు ఫిర్యాదులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో కొందరు వర్క్ ఇన్‌స్పెక్టర్లు బినామీ పేర్లతో కాంట్రాక్టర్లుగా మారుతున్నారు. తమ బంధువుల పేర్లతో కొందరు, తమకు అస్మదీయులైన కాంట్రాక్టర్ల పేర్లతో మరికొందరు టెండర్ వేసి పనులు దక్కించుకుంటున్నారు. ఎం-బుక్ రికార్డింగ్ కోసం ఆయా పనులకు సంబంధించిన కొలతలను తీసి సంబంధిత ఏఈలకు అందజేస్తున్నారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ల ఆగడాలపై స్వయంగా ఎమ్మెల్యే ఒకరు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా కనీసచర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు రేకెత్తిస్తోంది.



జీవీఎంసీ ఇంజనీరింగ్ విభాగంలో పబ్లిక్ వర్క్స్, నీటి సరఫరా, యూజీడీ, ఎలక్ట్రికల్ వంటి విభాగాలు ఉంటాయి. ఆయా విభాగాల ఆధ్వర్యంలో ఏటా సుమారు రూ.500 కోట్ల విలువైన అభివృద్ధి పనులు జరుగుతుంటాయి. అభివృద్ధిపనులతోపాటు ఇతర నిర్వహణాపరమైన పనులను పర్యవేక్షించే అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈ)లకు క్షేత్రస్థాయిలో సహాయకరంగా ఉండేందుకు వర్క్ ఇన్‌స్పెక్టర్లు పనిచేస్తుంటారు. జీవీఎంసీ పరిధిలో రెగ్యులర్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు 40 మంది ఉండగా, అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న వర్క్ ఇన్‌స్పెక్టర్లు 130 మంది ఉంటారు. అవుట్‌సోర్సింగ్ విధానం అమల్లోకి రాకముందు వీరంతా కాంట్రాక్టర్ల ద్వారా ఎన్ఎంఆర్ విధానంలో జీవీఎంసీలో పనిచేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కాంట్రాక్టర్ల వద్ద పనిచేసే వారిని అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్‌లోకి బదిలీ చేసిన విషయం తెలిసిందే. రెగ్యులర్ వర్క్ ఇన్‌స్పెక్టర్లతోపాటు అవుట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు తమకు కేటాయించిన వార్డుల్లో జరిగే అభివృద్ధి పనులను స్వయంగా పర్యవేక్షించడం, పనుల్లో నాణ్యత ఉండేలా చూడడం, పనులు పూర్తయిన తర్వాత ఎం-బుక్‌లో రికార్డు చేసేందుకు ఏఈలు వచ్చినప్పుడు కొలతలు తీసేందుకు సహకరించడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. వీరంతా సుమారు 15, 20 ఏళ్ల నుంచి ఒకే చోట పనిచేస్తుండడంతో మంచి అవగాహన వచ్చింది. దీంతో తామే స్వయంగా ఆ పనులను చేసుకుంటే భారీగా డబ్బులు మిగులుతాయని గుర్తించారు. కొందరు వర్క్ ఇన్‌స్పెక్టర్లు తమ బంధువులను కాంట్రాక్టర్లుగా రిజిస్ట్రేషన్ చేయించి వారి పేరిట టెండర్లలో పాల్గొంటున్నారు. మరికొందరు కాంట్రాక్టర్లలో తమకు అస్మదీయులుగా ఉన్నవారి పేరుతో టెండర్లు వేయించి పనులు దక్కించుకుంటున్నారు. తమ వార్డుల్లో జరిగే పనుల కోసం ఎక్కువ లెస్‌కు వేయడం లేదా ఇతర కాంట్రాక్టర్లు పాల్గొనకుండా

... మిగతా 6వ పేజీలో

ఎకనామిక్ జోన్‌కు 20,000 ఎకరాలు

నాలుగు జిల్లాల్లో ఐదేసి వేల ఎకరాలు...

- విశాఖకు 50 కి.మీ.లోపు భూములు గుర్తించాలని అధికారులకు ఆదేశాలు
- శ్రీకాకుళం జిల్లాలో అయితే భోగాపురం ఎయిర్‌పోర్టుకు 30-40 కిలోమీటర్ల పరిధిలో...
- రోడ్డు కనెక్టివిటీపైనా ప్రత్యేక దృష్టి
- భవిష్యత్తులో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కాకుండా ముందుగానే విస్తరణ



అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమైన మంత్రి లోకేశ్ (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): **ఉత్తరాంధ్రకు ఐటీ, భారీ పరిశ్రమలను తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందించిన కూటమి ప్రభుత్వం, అందుకు తగిన విధంగా మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారిస్తోంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాలను కలిపి కొత్తగా ఏర్పాటుచేయనున్న 'గ్రేటర్ విశాఖ ఎకనామిక్ జోన్'కు 20 వేల ఎకరాలు సేకరించనున్నారు.**

ఎకనామిక్ జోన్‌కు భూముల సేకరణపై ఆదివారం విశాఖలో నాలుగు జిల్లాల కలెక్టర్లతో రాష్ట్ర ఐటీ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన సమావేశంలో చర్చించారు. విశాఖపట్నం జిల్లాలో ప్రభుత్వ భూములు ఐదు వేల ఎకరాలు లేవని అధికారులు వివరించారు. ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి, గాజువాక మండలాల్లో ప్రభుత్వ, డీపట్టా భూములు మూడు వేల ఎకరాల వరకూ ఉన్నాయన్నారు. మిగిలిన మూడు జిల్లాల్లో ఐదు వేల ఎకరాల చొప్పున ప్రభుత్వ భూములు ఉన్నాయని సంబంధిత అధికారులు నివేదించారు. విశాఖ నగరానికి 50 కి.మీ. పరిధిలోపు, శ్రీకాకుళం జిల్లాలో మాత్రం భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి 30 నుంచి 40 కి.మీ. పరిధిలో భూములు మాత్రమే గుర్తించాలని ఈ సమావేశంలో పాల్గొన్న ఐటీ కార్యదర్శి కాటంనేని భాస్కర్ సూచించారు. విశాఖకు సమీపంలో అయితేనే పరిశ్రమల ఏర్పాటుకు కంపెనీలు మొగ్గుచూపుతాయని, అలాగే శ్రీకాకుళం జిల్లాలో భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి అరగంటలో చేరుకునేలా ఉంటేనే పెట్టుబడుదారులు ముందుకు వస్తారని స్పష్టంచేశారు.

అలాగే రోడ్ కనెక్టవిటీపైనా మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా చర్చించారు. బెంగళూరు, పూణే, హైదరాబాద్, తదితర నగరాల్లో ట్రాఫిక్ సమస్య కంపెనీలు, ఉద్యోగుల సహనానికి పరీక్ష పెడుతుందని, ఈ

... మిగతా 6వ పేజీలో



క్లో ట్రయాన్ (62)

దక్షిణాఫ్రికా రెండో విజయం

- అర్ధ సెంచరీలతో ఆదుకున్న మారిజానా కాప్, క్లో ట్రయాన్
- పోరాడి ఓడిన బంగ్లాదేశ్
- షర్మిన్ అక్తర్, షోర్నా అక్తర్ శ్రమ వృథా

విశాఖపట్నం-స్పోర్ట్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మహిళల వన్డే ప్రపంచకప్ టోర్నీలో భాగంగా సోమవారం ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన మ్యాచ్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. దక్షిణాఫ్రికా మిడిల్ ఆర్డర్‌లో మారిజాన కాప్ (56), క్లో ట్రయాన్ (62), చివర్లో డి క్లెర్క్ (37) రాణించడంతో బంగ్లాదేశ్ మూడు వికెట్ల తేడాతో ఓటమి

... మిగతా 6వ పేజీలో



కాప్ (56)

పడకేసిన ఏయూ ఆరోగ్య కేంద్రం

ఏళ్ల తరబడి అధికారుల నిర్లక్ష్యం

- ఆశించిన స్థాయిలో సదుపాయాలు లేవు
- అత్యవసర వైద్యం అందించే పరిస్థితులూ లేవు
- అధ్వానంగా అంబులెన్స్
- హాస్టల్ విద్యార్థి మృతిపై నియమించిన త్రిసభ్య కమిటీ నివేదిక?
- ఖాళీలను భర్తీ చేయడంతో పాటు విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించాలని సూచన



విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆరోగ్య కేంద్రంలో ఆశించిన స్థాయిలో సదుపాయాలు లేవని త్రిసభ్య కమిటీ తేల్చింది. ఈ మేరకు కలెక్టర్‌కు కొద్దిరోజుల కిందట నివేదిక సమర్పించింది. ఇటీవల హాస్టల్ విద్యార్థి ఒకరు మృతిచెందడంతో వర్సిటీ విద్యార్థులు పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తూ ఆంధ్ర మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సంధ్యాదేవి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణితో కమిటీని ఏర్పాటుచేశారు. ఈ కమిటీ వారంపాటు విచారణ జరిపి నివేదికను సమర్పించింది. అందులో ఏముందన్న దానిపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. త్రిసభ్య కమిటీ కీలక అంశాలను నివేదికలో ప్రస్తావించినట్టు తెలిసింది. విద్యార్థి మణికంఠ మాసివ్ హార్ట్ అటాక్ కారణంగా మృతిచెందినట్టు కమిటీ నిర్ధారించింది. విద్యార్థిని క్యాంపస్‌లోని ఆస్పత్రికి తీసుకువెళ్లినప్పుడు తగిన వసతులు, అత్యవసర వైద్యం అందించేందుకు అనుగుణమైన

... మిగతా 6వ పేజీలో

వృద్ధుడి అదృశ్యం


శ్రీనివాస్ (ఫైల్)

భీమునిపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రొట్టెలవీధి (కోటా వారి వీధి)లో నివసించే దాసరి శ్రీనివాస్ (62) అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో శ్రీనివాస్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగా రాలేదు. ఈ విషయమై ఆయన భార్య స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, శ్రీనివాస్ గత కొంతకాలంగా మతిస్థిమితం లేకుండా బాధపడుతున్నారు. బయటకు వెళ్లేటపుడు పింక్ కలర్ షర్టు, చెక్ షార్టు వేసుకున్నాడని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు. కేసును హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్‌రావు దర్యాప్తు చేస్తున్నారు.

తగరపువలసలో సఖీసురక్షా

తగరపువలస, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస పట్టణ ఆరోగ్య కేంద్రంలో సఖీ సురక్షా పేరుతో మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించే కార్యక్రమం సోమవారం నుంచి ప్రారంభించారు. ఈ ఆరోగ్య కేంద్రం సమీపంలో ఉన్న మీ-సేవా కేంద్రం, గ్రంథాలయం వద్ద కూడా ఉచిత పరీక్షలను నిర్వహిస్తున్నట్టు వైద్యాధికారులు తెలిపారు రక్తపోటు, చక్కెర వ్యాధి, క్యాన్సర్ స్క్రీనింగ్, నేత్ర వైద్య పరీక్షలు వంటి వ్యాధులకు సంబంధించి పరీక్షలు ఉచితంగా చేసుకోవచ్చన్నారు. మొదటిసారి హాజరైన మహిళలకు వారి పేరు వివరాలతో కార్డులను అందిస్తారని, ఈ కార్డును చూపిస్తే తదుపరి చికిత్సలు ఉచితంగా అందిస్తారని అన్నారు. పరీక్షలకు సంబంధించిన రిపోర్టులను వాట్సాప్ ద్వారా వారి ఫోను నంబర్‌కు పంపించే ఏర్పాటు చేస్తారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ వెసులుబాటు తగరపువలసకు మొదటిసారి అందుబాటులోకి వచ్చిందని వైద్యులు తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు 2 అర్జీలు

భీమునిపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు కేవలం రెండు అర్జీలు అందాయి. జోనల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ఆధ్వర్యంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి రెండు అర్జీలు మాత్రమే అందాయని అధికారులు తెలిపారు. వీటిని పరిశీలన నిమిత్తం ఇంజనీరింగ్ విభాగాధిపతి వద్దకు పంపినట్టు తెలిపారు.

అడివివరం హైస్కూల్ వద్ద బస్టాప్‌కు కార్పొరేటర్ వినతి


ఆర్టీసీ డీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పీవీ నరసింహం

సింహాచలం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహావిశాఖ 98వ వార్డులోని అడివివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు సమీపంలో సిటీ బస్సులు నిలిపేందుకు కావలసిన బస్టాప్‌ను తక్షణం ఏర్పాటు చేయాలని వార్డు కార్పొరేటర్ పీవీ నరసింహం కోరారు. సోమవారం ఏపీఎస్ఆర్టీసీ సింహాచలం డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వార్డులోని గాంధీనగర్, అంబేడ్కర్ కాలనీ, భూలోకనగర్ వాసులు బస్టాప్ లేక అవస్థలు పడుతున్నారు. విద్యార్థుల సౌకర్యార్థం స్కూల్ కూడలిలో బస్టాప్‌ను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. డిపో మేనేజర్‌ను కలిసినవారిలో తెదేపా వార్డు అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, బందం సూరిబాబు, బంటుబిల్లి ప్రసాద్ ఉన్నారు.

'అంబేడ్కర్ వర్సిటీ పునఃప్రారంభించాలి'

సాగర్‌నగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ యూనివర్సిటీని ఆంధ్రప్రదేశ్‌లో పునఃప్రారంభించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఈ యూనివర్సిటీని తెలంగాణకు పరిమితం చేసినందున ఆంధ్రప్రదేశ్‌లో కూడా పునఃప్రారంభించాలని మంత్రి లోకేశ్‌ను కోరినట్లు తెలిపారు.

సర్వీసురోడ్డును విస్తరించాలి

తగరపువలస, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి) : తగరపువలస జాతీయ రహదారికి అనుబంధంగా కుడిపక్కన ఉన్న సర్వీసు రోడ్డు నిత్యం రద్దీతో వాహనాలు తప్పుకోవడానికి అవకాశం లేకుండా ఉంది. జాతీయ రహదారికి కుడి, ఎడమ పక్కల రెండు సర్వీసురోడ్లు ఉన్నాయి. తగరపువలస భీమిలి తదితర ప్రాంతాలకు రావాలంటే విశాఖపట్నం రూటులో ఆనందపురం దాటిన తర్వాత వెల్లంకి వద్ద సర్వీసు రోడ్డులోకి రావాలి. అలాగే తగరపువలస నుంచి విశాఖ వైపు వెళ్లే వాహనాలు జాతీయ రహదారిలోకి ప్రవేశించాలంటే వేములవలస వరకు ప్రయాణించి అక్కడ జాతీయ రహదారిని ఎక్కవలసి ఉంది. దాదాపు అయిదు కిలోమీటర్ల మేర సర్వీసు రోడ్డులోనే ప్రయాణించవలసి ఉంటుంది. అందువల్ల ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటోంది. ముఖ్యంగా కుడివైపు ఉన్న సర్వీసురోడ్డుకు అనుబంధంగా తాళ్లవలస రోడ్డు ఎన్ఆర్ఐ రోడ్డు, వెల్లంకి రోడ్డు, భీమిలి రోడ్డులు కలుస్తాయి అంతేకాకుండా అనేక కార్పొరేట్ కళాశాలలు ఉన్నాయి. అందువల్ల ఈ సర్వీసురోడ్డు ప్రతిరోజూ రద్దీగా ఉంటోంది. ఆదివారం పూట వాహనాలు తాకిడి మరీ ఎక్కువగా ఉంటోంది. జాతీయ రహదారిని నిర్మించిన సమయంలో కేవలం 20 అడుగుల మేర సర్వీసు రోడ్డులను నిర్మించారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా వీటిని మరింత విస్తరించవలసి ఉంది.. ఈ సర్వీసు రోడ్లకు అనుకుని దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల కూడా ఇరుకు అయిపోయిందని వాహన చోదకులు అంటున్నారు. ఈ సర్వీసు రహదారులను విస్తరించి వాహనాల రాకపోకలకు అనుకూలంగా చేయాలని పలువురు కోరుతున్నారు.


తగరపువలస జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో రద్దీ

విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలగాలి

- నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ
- అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, పాల్గొన్న కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి తదితరులు

భీమునిపట్నం (రూరల్) అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా సత్ప్రవర్తన, శ్రద్ధాసక్తులతో విద్యాభ్యాసం చేయాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ పేర్కొన్నారు. సోమవారం స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతై ముఖ్యంగా విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, ఎవరైనా తోటి విద్యార్థులు దారి తప్పుతుంటే వారి విషయాన్ని అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. మాదక ద్రవ్యాలు, చెడు అలవాట్లకు అలవాటు పడితే నేర ప్రవృత్తి అలవడుతుందన్నారు. కళాశాలల్లో రాగింగ్ నిషేధించిన అంశమని, కొత్త విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన మాజీ మంత్రి, కళాశాల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివారావు మాట్లాడుతూ వృత్తిపరమైన శిక్షణను ఆధునిక పరిజ్ఞానంతో అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్సు అందిస్తున్నామని, 24 గంటల పాటు ఇంటర్‌నెట్ సదుపాయాన్ని కల్పిస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో కళాశాల ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.ప్రియాంక, ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ, శ్రీకాకుళం ట్రిబుల్ ఐటీ డైరెక్టర్ టీవీ రమణ, సైంటిస్టు డి.సమీర్, ఇన్ఫోసిస్ సిటీ మేనేజర్ కె.కిశోర్, బ్రహ్మాకుమారి సిస్టర్ మాధురి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మురళీకృష్ణ తదితరులు మాట్లాడారు. అనంతరం.. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు చేతుల మీదుగా మెమొంటోలను అందించారు. ఈ సందర్భంగా నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ సీనియర్ విద్యార్థులు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

గూగుల్ డేటా సెంటర్‌కు మా భూములివ్వం

- ఆర్డీవో కార్యాలయం ఎదుట తర్లువాడ రైతుల ఆందోళన

భీమునిపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : తర్లువాడలో ఏర్పాటు చేయనున్న గూగుల్ డేటా సెంటర్‌కు తమ భూములు ఇచ్చేది లేదని ఆ గ్రామ ఎస్సీ కాలనీ రైతులు చెబుతున్నారు. దీనిపై నిరసన వ్యక్తం చేస్తూ భీమిలి ఆర్డీవో కార్యాలయం ముందు సోమవారం ధర్నా చేపట్టారు. రైతుల ఆందోళనకు మద్దతు ప్రకటించిన సీపీఎం భీమిలి కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ తర్లువాడ ప్రాంతంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేస్తే ఆ ప్రాంతమంతా కాలుష్యమైపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. డేటా సెంటర్ నుంచి వెలువడే రేడియేషన్ వల్ల ప్రజలు అనారోగ్యం పాలవుతారని,పరిసర ప్రాంతాల్లో కూరగాయలు, పండ్లు, పువ్వుల పంటలు పండవని, పంటలన్నీ నాశనమై రైతుల జీవితాలు దుర్భరంగా మారుతాయన్నారు. గెడ్డ నీరంతా కలుషితమై, తాగడానికి గుక్కెడు మంచినీళ్లు కూడా దొరకని పరిస్థితులు దాపురిస్తాయన్నారు. ఇక్కడి ఎస్సీ రైతులు స్థానిక భూములను సాగు చేసుకొని బతుకు తున్నారని, వారి పొట్ట కొట్టవద్దని కోరారు. అనంతరం, ఆర్డీవో సంగీత్‌మాధుర్‌కు రైతులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.అప్పలనాయుడు, సీఐటీయూ మండల అధ్యక్షుడు ఎస్.రాము పాల్గొన్నారు.

'నకిలీ మద్యంపై సీబీఐతో విచారణ చేపట్టాలి'

భీమునిపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో నకిలీ మద్యంపై సీబీఐ విచారణకు అప్పగించాలని వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు భీమిలిలో సోమవారం నియోజకవర్గ వైసీపీ కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ మహిళలు ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు తొలుత చిన్నబజార్ జంక్షన్‌లో ఉన్న దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అక్కడి నుంచి చిన్నబజార్ జంక్షన్, పోలీసుస్టేషన్ మీదుగా ఎక్సైజ్ కార్యాలయం వరకూ ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ పిన్నింటి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ నకిలీ మద్యం సరఫరాపై నిజానిజాలు వెలుగులోకి రావాలంటే సీబీఐ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.



తడిసి ముద్దయిన సింహగిరి

సింహాచలం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అల్పపీడనాల ప్రభావంతో ఈ ఏడాది సింహాచలం వరాహగిరిపై అనేకసార్లు వర్షించింది. వాతావరణంలో మార్పుల కారణంగా సోమవారం ఉదయం నుంచి కురిసిన భారీ వర్షం సింహగిరిని తడిపి ముద్ద చేసింది. ప్రధానంగా అప్పన్న దర్శనం చేసుకునేందుకు వచ్చిన భక్తులు వర్షం కారణంగా తడుస్తూనే ఉన్నారు. తాజా వాతావరణం కారణంగా వినువీధుల్లో కారుమేఘాలు దట్టంగా కమ్ముకోవటంతో ఆ అద్భుత సుందర దృశ్యం భక్తులకు నయనానందం కలిగించింది. పలువురు భక్తులు సింహగిరిపై నెలకొన్న సుందర దృశ్యాలను తమ సెల్‌ఫోన్ కెమేరాలలో బంధించి మురిసిపోయారు.

మాడవీధిలో చినుకులలో సంచరిస్తున్న భక్తులు

సింహాద్రినాథునికి ఆర్జిత సేవలు


స్వామికి వేదపండితుడి తులసీ దళార్చన

సింహాచలం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఇలవేల్పుగా సింహగిరులపై కొలువైన వరాహలక్ష్మీనృసింహస్వామికి సోమవారం పలు ఆర్జిత సేవలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వాటిలో భాగంగా వేకువజామున సుప్రభాతసేవ, ప్రభాత ఆరాధనలు జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను పుష్ప మాలికలు, స్వర్ణాభరణాలతో శోభాయమానంగా అలంకరించి వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విష్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. నారసింహ సహస్ర నామావళి పఠిస్తూ పవిత్ర తులసీ దళార్చన నిర్వహించారు. అనంతరం అదే వేదికపై పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో ఆర్జిత నిత్యకల్యాణాన్ని వైభవంగా జరిపి స్వామికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

అప్పన్న సన్నిధిలో తమిళ ఆధ్యాత్మిక వేత్త


ఆలయంలో వరాహ మహాదేశికన్ స్వామికి సంప్రదాయ స్వాగతం పలుకుతున్న అర్చకులు

సింహాచలం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహ స్వామిని తమిళనాడు శ్రీరంగం ప్రాంతానికి చెందిన శ్రీమత్ అండవన్ ఆశ్రమ పన్నెండో పీఠాధిపతి వరాహ మహాదేశికన్ స్వామి సోమవారం దర్శించుకున్నారు. స్వామీజీకి అధికారులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. బేడామండప ప్రదక్షిణ తరువాత అంతరాలయంలో అర్చకులు లోకకల్యాణార్థం అనే సంకల్పంతో అప్పన్నస్వామికి ప్రత్యేక పూజలు చేసి శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి అమ్మవారి సన్నిధానంలో కుంకుమ పూజల తరువాత ఆలయ పండితులు చతుర్వేద స్వస్తి వచనాలతో వేదాశీర్వచనాలిచ్చారు. అధికారులు శాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

కేజీబీవీ పాఠశాలను సందర్శించిన ఆర్‌జేడీ

పద్మనాభం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పద్మనాభంలోని కేజీబీవీ పాఠశాలను విద్యాశాఖ విశాఖపట్నం ఆర్‌జేడీ విజయభాస్కర్ సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా రేవిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన 'బాలికలను రక్షిద్దాం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వారికి పీహెచ్‌సీ వైద్యాధికారులు పీసీ, పీఎన్‌టీడీ తదితర వాటిపై అవగాహన కల్పించారు. సీపీఆర్ చేసే విధానాన్ని వైద్యాధికారులు నేర్పారు. అనంతరం ఆయన పాఠశాల మెనూను పరిశీలించి విద్యార్థుల భోజన పదార్థాలను తనిఖీ చేశారు. సాంప్-2 పరీక్షలను పరిశీలించారు.కార్యక్రమంలోసీఎంఓ దేవుడుబాబు, రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు లీలాప్రసాద్, సౌజన్య, ప్రిన్సిపాల్ గ్రేస్‌లిల్లీ పాల్గొన్నారు.


విద్యార్థులు రాస్తున్న సాంప్-2 పరీక్షలను పరిశీలిస్తున్న ఆర్‌జేడీ విజయభాస్కర్

బదిలీ ఉపాధ్యాయుడికి సన్మానం

భీమునిపట్నం (రూరల్) అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి) : భీమిలి రూరల్ మండలం తాటితూరులో 11 సంవత్సరాలుగా హిందీ ఉపాధ్యాయుడిగా పని చేసిన టీఎస్వీ ప్రసాదరావుకు బదిలీ అయిన సందర్భంగా సోమవారం పాఠశాలలో వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు, విద్యార్థులు పలువురు పాల్గొన్నారు.

ప్రజల్లో అవగాహన లేక కీళ్ల నొప్పుల సమస్య

గీతం ఆర్థో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్

ఎండాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గీతం ఆసుపత్రి (జిమ్‌సర్) ఆధ్వర్యంలో ప్రపంచ ఆర్థరైటీస్ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. గీతం ఆసుపత్రి ఆవరణతో పాటు స్థానిక జాలరిపేటలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గీతం ఆసుపత్రి ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ దేశ జనాభాలో అనేక మంది రకరకాల కీళ్ల వ్యాధులతో బాధపడుతున్నారని, ముఖ్యంగా 45 సంవత్సరాలు పైబడిన వారిలో ఈ సమస్య అధికంగా ఉంటుందన్నారు. ఆర్థరైటిస్ ఎముకలు, వాటి కణజాలాలకు సంబంధించిన సమస్య అని, ప్రజలకు వీటిపై సరైన అవగాహన లేకపోవడంతో వ్యాధి తీవ్రత పెరిగిన తర్వాత మాత్రమే వైద్యులను సంప్రదిస్తున్నారని పేర్కొన్నారు. పోషకాహార లోపం, ఊబకాయం, కీళ్లమీద బరువు పడటం, ఒత్తిడి, నిద్రలేమి వంటి వివిధ కారణాలతో కీళ్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వివరించారు. జిమ్‌సర్ ఆసుపత్రి ద్వారా కీళ్ల వ్యాధుల చికిత్స, కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలకు నవజీవన్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. ఉచిత వైద్య శిబిరంలో సుమారు 120 మంది హాజరై మందులు, వైద్య సలహాలు పొందారు. వైద్యులు టి.రాజశేఖర్, సతీష్‌కుమార్, జిమ్‌సర్ ఆపరేషన్స్ హెడ్ డాక్టర్ భోగవల్లి కార్తీక్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.


ఆర్థరైటిస్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

నేడు భీమిలికి ఎమ్మెల్యే గంటా రాక

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

భీమునిపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ నెల 14న పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్టు ఆయన కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు సోమవారం రాత్రి ప్రకటన వెలువరించారు. మంగళవారం ఉదయం పది గంటలకు భీమిలి బీచ్‌రోడ్డులో ఉన్న క్యాంపు కార్యాలయం వద్ద జీవీఎంసీ భీమిలి జోన్ 3వ వార్డులో పలు అభివృద్ధి పనులు శంఖుస్థాపన చేస్తారు. అనంతరం, మత్స్యకార లబ్ధిదారులకు బోట్ ఇంజన్లు అందజేస్తారు. అలాగే, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొంటారు.

అతీగతీ లేని అదానీ డేటా సెంటర్

... 5వ పేజీ తరువాయి

ప్రహరీ నిర్మాణం మాత్రమే చేస్తున్నారు. ఇతరత్రా పనులు ఏమీ చేయడం లేదు. ఇప్పట్లో అదానీకి ఇక్కడ డేటా సెంటర్ నిర్మించే ఆలోచన లేదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

నోటీసులు ఇస్తాం: ఏపీఐఐసీ అధికారి

భూమి స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి మూడేళ్లలో ఆపరేషన్లు చేపట్టాలనే నిబంధనతో ఒప్పందం జరిగింది. ఇప్పటికే రెండేళ్లు అయ్యింది. పనులు ప్రారంభించకపోతే త్వరలోనే నోటీసులు ఇస్తాం. జరిమానా చెల్లించి ఒప్పందం పునరుద్ధరించుకోవలసి ఉంటుంది.

పడకేసిన ఏయూ ఆరోగ్య కేంద్రం

... 5వ పేజీ తరువాయి

పరిస్థితులు లేవని, అంబులెన్స్ అధ్వానంగా ఉందని పేర్కొన్నట్టు తెలిసింది. అలాగే, విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడినట్టు అభిప్రాయపడింది. ముఖ్యంగా డిస్పెన్సరీ ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురికావడం వల్లే ఈ పరిస్థితి దాపురించినట్టు తెలిపింది. వేలాది మంది విద్యార్థులు, సిబ్బందికి వైద్య సేవలు అందించే ఆస్పత్రిలో తగినంతమంది వైద్యులు, సిబ్బంది లేరని, అయినా అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని నివేదికలో పేర్కొంది. ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనతోపాటు సిబ్బంది నియామకం చేపట్టాలని, మందులు అందుబాటులో ఉంచడంతోపాటు విద్యార్థులకు సీపీఆర్‌తోపాటు ప్రాథమిక వైద్య సేవలు (ఫస్ట్ ఎయిడ్) అందించడంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కమిటీ సూచించింది. అయితే, ఈ నివేదికను ఆధారంగా చేసుకుని ఎటువంటి చర్యలు తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది.

పొదుపు సొమ్ము స్వాహా చేసిన నకిలీ ఆర్పీ

... 5వ పేజీ తరువాయి

మొదలుపెట్టారన్నారు. పొదుపు సంఘంలో పది మంది బ్యాంకు పుస్తకాలు, సంఘం రికార్డులు ఆమె తన వద్ద ఉంచుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘం ఏర్పాటు తరువాత తొలి ఏడాది రూ.లక్ష, ఆ తరువాత ఏడాది రూ.3 లక్షలు, ఇంకా మరోసారి రూ.7 లక్షలు రుణం తీసుకున్నామని, ప్రతినెలా క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించామన్నారు. సకాలంలో రుణం చెల్లించినందుకు ప్రభుత్వం తమకు ఇచ్చిన వడ్డీ రాయితీని ఆ ఆర్పీ స్వాహా చేశారని ఫిర్యాదులో ఆరోపించారు.

ఇలా సుమారు రూ.1.5 లక్షల వరకు స్వాహా చేశారని, ప్రతినెలా పొదుపు కింద కట్టే రూ.200 ఆమె సొంతానికి వాడుకున్నారని వాపోయారు. ఆమె తీరుపై అనుమానం వచ్చి యూసీడీకి చెందిన అక్కయ్యపాలెం సీఈవోను సంప్రతిస్తే సదరు మహిళ ఆర్పీ కాదన్నారని పేర్కొన్నారు. తమతోపాటు మరో 12 సంఘాలను నకిలీ ఆర్పీ మోసం చేసిందని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్లే కాంట్రాక్టర్లు!

... 5వ పేజీ తరువాయి

బెదిరించడం చేస్తున్నారు. జోన్-8 పరిధిలో ముగ్గురు అవుట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు తమ కుటుంబసభ్యుల పేర్లతో పనులు చేస్తున్నారు. జోన్-5ఏలో ఒకరు, జోన్-3లో ఒకరు, జోన్-7లో ముగ్గురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు పనులు చేస్తున్నారు. ఇక ఏఈలు కూడా క్షేత్రస్థాయికి వెళ్లకుండా వారు (వర్క్ ఇన్‌స్పెక్టర్లు) ఇచ్చిన వివరాలనే ఎం-బుక్‌లో నమోదుచేసి బిల్లు కోసం పంపించేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉత్తర నియోజకవర్గ పరిధిలోని వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఏళ్ల తరబడి ఒకేచోట ఉండిపోయారని, పలువురు అక్రమాలకు పాల్పడుతున్నందున వేరొకచోటకు మార్చాలని కోరుతూ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు స్వయంగా జీవీఎంసీ అధికారులకు లేఖ ద్వారా విజ్ఞప్తిచేశారు. కానీ అధికారులు మాత్రం ఇంతవరకూ దీనిపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. ఇదిలావుండగా డీఈగా పనిచేస్తున్న ఒక ఇంజనీరింగ్ అధికారి సైతం తన బావమరిదిని కాంట్రాక్టర్‌గా రిజిస్ట్రేషన్ చేయించి తన జోన్ పరిధిలో భారీగా పనులు చేసుకుంటున్నారు.

ఎకనామిక్ జోన్‌కు 20,000 ఎకరాలు

... 5వ పేజీ తరువాయి

నేపథ్యంలో కొన్ని సంస్థలు ఏపీ వైపు చూస్తున్నందున వారికి ఇబ్బంది లేకుండా రోడ్ కనెక్టవిటీ పెంచాలని లోకేశ్ కోరారు. కంపెనీలు వచ్చిన తరువాత కాకుండా ముందుగానే రహదారుల విస్తరణ, అవసరమైన ప్రాంతాల్లో నాలుగు నుంచి ఆరులైన్ల రోడ్ల ఏర్పాటు దిశగా దృష్టిసారించాలని ఆదేశించారు. కంపెనీల కార్యకలాపాలు ప్రారంభించిన తరువాత ట్రాఫిక్ సమస్య పెరిగితే స్థానికులు, ఉద్యోగుల నుంచి వ్యతిరేకత వస్తుందని, అందుకే ముందుగానే పక్కాగా రోడ్ కనెక్టవిటీ ఉండాలన్నారు. ఉత్తరాంధ్రలో ఐదు లక్షల ఉద్యోగాలు ఇస్తామని 2024 ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన సమావేశంలో గుర్తుచేశారు. అందుకు తగ్గట్టుగా పరిశ్రమలు తీసుకువస్తామన్నారు. ఈ వారంలో ఆస్ట్రేలియా వెళ్లి అక్కడ ఒక కంపెనీతో చర్చించనున్నామని వివరించారు. వచ్చే నెలలో విశాఖలో నిర్వహించనున్న పెట్టుబడులు సదస్సులో మరికొన్ని కంపెనీలతో ఒప్పందాలు జరగనున్నాయన్నారు.

ఇదిలావుండగా విశాఖ జిల్లాలో 15 మాస్టర్ ప్లాన్ రహదారుల అభివృద్ధికి ఇప్పటికే వీఎంఆర్‌డీఏ అధికారులు నడుంబిగించారు. ఈ రోడ్లకు పొరుగు జిల్లాల నుంచి అనుసంధానం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. ఒక జిల్లాలో పరిశ్రమలు, మరో జిల్లాలో ఎయిర్‌పోర్టు, మరో జిల్లాలో భూములు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నాలుగు జిల్లాల మధ్య అనుసంధానం కోసం గ్రేటర్ విశాఖ ఎకనామిక్ జోన్ ఏర్పాటుచేస్తున్నారు.

దక్షిణాఫ్రికా రెండో విజయం

... 5వ పేజీ తరువాయి

చెందింది. అయితే బంగ్లాదేశ్ పోరాట పటిమ ఆకట్టుకున్నది.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ బ్యాటర్లపై దక్షిణాఫ్రికా బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. బంగ్లా ఓపెనర్లు ఫర్గాన హక్ (30), రబ్యా హైదర్ (25) 16 ఓవర్లపాటు క్రీజులో నిలబడి తొలి వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 20 పరుగుల తేడాలో ఓపెనర్లు ఇద్దరూ అవుట్ కావడంతో క్రీజులోకి వచ్చిన షర్మిన్ అక్తర్, కెప్టెన్ నిగర్ సుల్తానా (32) దక్షిణాఫ్రికా బౌలర్లపై దాడికి దిగి జట్టు స్కోరును 30 ఓవర్లలో వందకు చేర్చారు. నిగర్ సుల్తానా స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన షోర్న అక్తర్...షర్మిన్ అక్తర్ కలిసి వేగం పెంచడంతో 40 ఓవర్లలో జట్టు స్కోరు 150 పరుగులకు చేరింది. ఈ దశలో షర్మిన్ అక్తర్ 74 బంతుల్లో 6 బౌండరీలతో అర్ధ సెంచరీ పూర్తిచేసి అనూహ్యంగా రనౌటై పెవెలియన్‌కు చేరింది. షోర్నా అక్తర్ కేవలం 34 బంతుల్లో మూడు బౌండరీలు, మూడు సిక్సర్లతో అర్ధ సెంచరీ పూర్తి చేయడంతో బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్లకు 232 పరుగులు చేసింది.

అర్ధ సెంచరీలతో ఆదుకున్న మారిజానా కాప్, క్లో ట్రయాన్

లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ బౌలర్లను ఎదుర్కోవడంలో దక్షిణాఫ్రికా బ్యాటర్లు తడబడ్డారు. కేవలం 78 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయిన దశలో మారిజానా కాప్ (56), క్లో ట్రయాన్ (62) అర్ధ సెంచరీలతో ఆదుకున్నారు. ఇద్దరూ క్రీజులో ఉన్నంతసేపు విజయం ఖాయమనుకున్న సమయంలో క్లో ట్రయాన్ రనౌట్ అవ్వడంతో మ్యాచ్ రసవత్తరంగా మారింది. చివరి మూడు ఓవర్లలో మ్యాచ్ ఫలితంపై ఉత్కంఠ నెలకొంది. చివరి ఓవర్‌లో ఎనిమిది పరుగులు చేయాల్సి వచ్చింది. నహీద్ అక్తర్ వేసిన ఓవర్‌లోని మూడో బంతిని డీ క్లెర్క్ లాంగ్ ఆన్ మీదుగా కొట్టగా బౌండరీ లైన్ వద్ద షోర్నా అక్తర్ క్యాచ్ జారవిడిచింది. తర్వాత బంతిని సిక్సర్‌గా మలిచి జట్టుకు విశాఖలో వరుసగా రెండో విజయాన్నందించింది.

12వ వార్డులో వీధి దీపాల నిర్వహణపై నిర్లక్ష్యం



ఈశ్వరదేవీనగర్‌లో పట్టపగలు వెలుగుతున్న వీధి దీపం

ఆరిలోవ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 12 వ వార్డులో గల ఈశ్వర దేవీనగర్ కొండవాలు ప్రాంతంలో వీధిలైట్లు పగలూ రాత్రి తేడా లేకుండా వెలుగుతున్నాయి. ఎప్పటి నుంచో ఇదే పరిస్థితి ఉన్నా పట్టించుకోవడమే లేదు. దీంతో విద్యుత్ వృథా అవుతున్నది. అధికారులు మాత్రం విద్యుత్ ఆదా చేయాలంటూ ప్రకటనలు గుప్పిస్తుంటారు. కానీ, వాస్తవ రూపంలో విద్యుత్ వృథాను అరికట్టడంపై దృష్టి పెట్టకపోవడం శోచనీయమని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా వీధి లైట్ల నిర్వహణ తీరు సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చెత్త తరలింపు



డాక్టర్స్ కాలనీలో చెత్త తొలగిస్తున్న పారిశుధ్య సిబ్బంది

వెంకోజీపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డులో ఎక్కడిబడితే అక్కడ పేరుకుపోయిన చెత్త, చెట్టు కొమ్మలను శానిటరీ సిబ్బంది సోమవారం తొలగించారు. ఇటీవల వీచిన గాలికి డాక్టర్స్ కాలనీలో విరిగి పడిన చెట్టుకొమ్మలు, సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలోని రోడ్డుపై పేరుకుపోయిన చెత్త, హెచ్‌బీ కాలనీ రోడ్డుపై నిల్వ ఉన్న చెత్తను శానిటరీ సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పరిశుభ్రంగా తీర్చిదిద్దారు.

క్రీడాస్ఫూర్తి అలవరచుకోవాలి

గోపాలపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన క్రీడాస్ఫూర్తి అలవర్చుకునేవారు విజయతీరాలను చేరుతారని నేవల్ సిస్టమ్స్ అండర్ మెటీరియల్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వీ హరప్రసాద్ అన్నారు. ఎన్ఎస్‌టీఎల్ వేదికగా డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న డీఆర్‌డీవో సెంట్రల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ 2025-26ను డాక్టర్ హరప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాలకు ఎంతగానో దోహదపడతాయన్నారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి.
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ -2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజి** : శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, , లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 25, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 36, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 30, బీరకాయలు 36, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 20, క్యారెట్ 58, దొండకాయలు 38, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 76, బరబాటి 48, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 60, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 32, కాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 36, దేముడు చిక్కుడు 74, గోరు చిక్కుడు 40, కూర పెండలం 26, బ్రకోలి 45, పనస పొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 100, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

సర్వేలతోనే సరిపెడుతున్నారు!

» ఎమ్మెల్యే ఆదేశించినా భూ హక్కుల బదలాయింపుపై తాత్సారం » ఇప్పటి వరకూ 5 సార్లు సర్వే » భానునగర్ కాలనీ వాసుల అసంతృప్తి



కాలనీ వాసులను వివరాలను అడిగి తెలుసుకుంటున్న వీఆర్వోలు

వెంకోజీపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా అధికారుల తీరుమాత్రం మారడం లేదని, ఇంకా గత ప్రభుత్వం హయాంలోనే వ్యవహరిస్తున్నట్టుగానే ఉంటున్నారని 16వ వార్డుకు చెందిన భానునగర్ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 1990లో హెచ్‌బీ కాలనీ నుంచి పాత వెంకోజీపాలెం వరకు రోడ్డు విస్తరణలో భాగంగా స్థలాలను కోల్పోయిన స్థానికులకు భానునగర్‌లో లే అవుట్‌లను వేసి స్థలాలను కేటాయించారు. అయితే ఆ భూములను 22 ఏ ఉన్నాయన్న కారణంతో స్థల యజమానులు క్రయవిక్రయాలు చేపట్టేందుకు, రుణాలు పొందేందుకు అవకాశం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చాక చేపట్టిన రెవెన్యూ సదస్సులో కాలనీ వాసులు ఈ విషయమై ప్రజా ప్రతినిధులు, అధికారులకు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు చొరవ తీసుకుని జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో కూడా మాట్లాడి వెంటనే కాలనీలోని నష్టపరిహారంగా ఇచ్చిన భూములను 22ఏ నుంచి తొలగించాలని స్పష్టం చేశారు. దీంతో కలెక్టర్ కార్యాలయం నుంచి జేసీ, ఆర్డీవో, తహసీల్దార్, ఆర్‌ఐ... ఇలా అధికార యంత్రాంగం ఇక్కడకు వచ్చి ఇప్పటికి 4సార్లు సర్వే చేయడం, స్థానికుల నుంచి వివరాలను సేకరించడం చేశారు. ఈ సర్వే చేసినప్పుడల్లా ఇది ప్రభుత్వ భూమి కాదని, త్వరలోనే కాలనీవాసులకు తమ భూములపై పూర్తి హక్కులను కల్పిస్తామని హామీలు ఇచ్చి వెళ్లిపోయారు.

అయితే ఇప్పటి వరకూ కాలనీవాసులకు తమ భూములపై హక్కులైతే సంక్రమించలేదు. కాగా, సోమవారం 5 సారి వీఆర్వోలు సర్వే చేయడానికి వచ్చారు. దీన్ని బట్టి ప్రభుత్వం మారిన అధికారుల తీరు మాత్రం గత ప్రభుత్వం హయాంలోనే ఉన్నట్టు ఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం సర్వేలతో కాలం వెళ్చిస్తున్నారు తప్ప తమ భూములపై హక్కులను మాత్రం తమకు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరు సర్వే చేసిన ప్రతిసారి తామంతా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంటుంది. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తమకోసం చొరవ చూపిన అధికారులు మాత్రం తమకు నచ్చినట్టు వ్యవహరిస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎటువంటి శ్రద్ధ వహించడం లేదని వాపోతున్నారు. తమ వంటి చిన్న సమస్యనే తీర్చడానికి కాలాన్ని వెళ్చిస్తుంటే అమరావతి భూముల యజమానులకు ఎన్ని తిప్పలు పెడతారోనని దుయ్యబడుతున్నారు. ఇప్పటికైనా తమ భూములపై హక్కులను తక్షణమే కల్పించకపోతే తాము ఆందోళన చేస్తామని కాలనీ వాసులు హెచ్చరించారు. దీనిలో కాలనీ అసోసియేషన్ సభ్యులు వంకా శివశంకర్ లాజరస్, ఒమ్మి నాయుడు తదితరులు ఉన్నారు.

వరద నీటితో నిండిన పెదగదిలి జంక్షన్



వరద నీటితో నిండిన పెదగదిలి కూడలి

ఆరిలోవ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఈ ప్రాంతంలో సోమవారం ఉదయం కురిసిన వర్షాలకు పెదగదిలి జంక్షన్ వరద నీటిలో నిండిపోయింది. వర్షం నీరు సమీపంలోని కొండ మీద నుంచి జాలువరగా, ఈ జంక్షన్‌కు చేరిన నీరు ఎటూ వెళ్లడానికి అవకాశం లేకపోవడంతో వరద నీరు ఇక్కడే నిలిచిపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగింది. చిన్న వర్షం పడినా ఈ జంక్షన్‌లో ఇలా వరద నీరు చేరడం పరిపాటిగా మారింది. ఎప్పటి నుంచో ఈ సమస్య ఉన్నప్పటికీ పరిష్కారం చూపడంతో అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించడం లేదు. దీనివల్ల స్థానికులు, వాహన చోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి దృష్టి సారించాలని కోరుతున్నారు.

రాధికా రాంబాబు ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ద్వారకా ఏసీపీ నరసింహమూర్తి తదితరులు

పెదవాల్తేరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఈశ్వర్ ఫిల్మ్ ప్రొడక్షన్ బ్యానర్‌పై రూపొందుతున్న 'రాధికా రాంబాబు- మధ్యలో రంగడు' సినిమా ఫస్ట్ పోస్టర్‌ను ద్వారకా ఏసీపీ నరసింహమూర్తి విడుదల చేశారు. సోమవారం లాసన్స్ బే కాలనీలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ద్వారక ఏసీపీ నరసింహమూర్తి, ఎంవీపీ కాలనీ సీఐ ప్రసాద్‌యాక్టర్ రమేష్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి ఈశ్వర్ ఉంగరాలు దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజిక్ నిప్పి జస్టిన్, ఎడిటింగ్, వీఎఫ్ఎక్స్ శ్రీహరిబాబు ఆర్టిస్టులు మని ప్రిన్సెస్, ఆర్యన్ అజయ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. కార్యక్రమంలో విశాఖ జిల్లా ఆర్ఎంపీ వైద్యుల అసోసియేషన్ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, మురళీ తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా 22వ వార్డు

» ఎక్కడికక్కడే చెత్త కుప్పలు
» తరలించని పారిశుధ్య సిబ్బంది
» దుర్గంధంతో జనం ఇబ్బందులు

మద్దిలపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 22వ వార్డులో అపరిశుభ్రత తాండవం చేస్తోంది. వీధుల్లో చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నది. పూడికలతో కాల్వలు అధ్వానంగా తయారయ్యాయి. పీతలవానిపాలెం జంక్షన్‌లో గెడ్డలో పది రోజుల కిందట పూడికలు తీశారు. తడిగా ఉన్న పూడికలను తొలగించడం కుదరక పొడిగా అయ్యే వరకు రోడ్డుపై కుప్పలుగా పోశారు. పూడికలు ఎండిపోయి వారం రోజులు కావస్తున్నా ఇంత వరకూ తొలగించలేదు. ప్రధాన జంక్షన్‌లో ఈ చెత్తకుప్పలు ఉండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దుర్వాసన వస్తుండడంతో ముక్కులు మూసుకొని రాకపోకలు కొనసాగిస్తున్నారు. రోడ్డుకు అడ్డంగా పెద్ద కుప్పలుగా నిల్వ ఉన్నందున రాకపోకలకు సైతం అవస్థలు పడుతున్నారు. వారం కిందట ఈదురు గాలులకు పిఠాపురం కాలనీలో భారీగా చెట్లు కూలిపోయాయి. రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టుకొమ్మలను నరికి పక్కన గుట్టలుగా వేశారు. కొన్ని ప్రాంతాల్లో చెట్టుకొమ్మలు తొలగించారు. మరికొన్ని ప్రాంతాల్లో అలాగే వదిలేశారు. ముత్తూట్ ఫైనాన్స్ రోడ్డులో ఇళ్ల గేట్ల ముందు ఉన్న చెట్ల కొమ్మలు తొలగించకపోవడంతో అక్కడి నివాసులు బయటకు రావడానికి కూడా అవసలు పడుతున్నారు. రోడ్ల మీదా అడ్డంగా ఉన్నచెత్తకుప్పలు,పూడికలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ముత్తూట్ ఫైనాన్స్ రోడ్డులో చెత్తకుప్పలు



పీతలవానిపాలెం జంక్షన్ రోడ్డుపై పూడికలు

త్వరితగతిన రోడ్డు విస్తరణ పనులు

» ఇంజనీరింగ్ అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం
» అడవివరం నుంచి దారపాలెం వెళ్లే బీఆర్టీఎస్ రోడ్డు పనులు పరిశీలన



దార పాలెం బీఆర్టీఎస్ రోడ్డును పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ అమిత్ గార్గ్, ఇంజనీరింగ్ అధికారులు

ఆరిలోవ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : అడవివరం నుంచి దారపాలెం బీఆర్టీఎస్ రోడ్డులో పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన 8వ జోన్ పరిధిలోని అడవివరం నుంచి దారపాలెం వెళ్లే బీఆర్టీఎస్ రోడ్డులో (ఎస్టీసీ -సింహాచలం ట్రాన్సిట్ కారిడార్) పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులను జీవీఎంసి ప్రధాన ఇంజనీరు పీవీవీ సత్యనారాయణ రాజుతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నవంబరులో అంతర్జాతీయ భాగస్వామ్య సదస్సు విశాఖ వేదికగా జరగబోతున్న నేపథ్యంలో నగర సుందరీకరణ, రోడ్డు అభివృద్ధి, విస్తరణ పనులు వేగవంతంగా చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అందులో భాగంగా ఆదివారం నుంచి దారపాలెం వెళ్లే బీఆర్టీఎస్ రోడ్డులో ఎడమ వైపున 350 మీటర్లు పెండింగ్‌లో ఉన్న రోడ్డు (ఎస్టీసీ) సింహాచలం ట్రాన్సి కారిడార్ విస్తరణ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసి ప్రధాన ఇంజనీరును ఆదేశించారు. రోడ్డు విస్తరణలో సింహాచలం ట్రాన్సిట్ కారిడార్‌లో ఆస్తులు కోల్పోయిన 27 ఆస్తులకు సంబంధించి స్థలాలను రోడ్డు మ్యాప్ ద్వారా పరిశీలించి సంబంధిత ఆస్తులకు టీడీఆర్‌లు జారీ చేసే ప్రక్రియకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జీవీఎంసీ అసిస్టెంట్ సిటీ ప్లానర్ రామలింగేశ్వర రెడ్డిని ఆదేశించారు. రోడ్డు విస్తరణ పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా పనులు వేగవంతం చేసి త్వరితగతిని పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ప్రధాన ఇంజనీర్‌కు కమిషనర్‌కు ఆదేశించారు. ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజనీరు కె శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ హెచ్ శంకరరావు, కార్యనిర్వాహక ఇంజనీరు దిలీప్, ఉపకార్యనిర్వాహక ఇంజనీరు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు రోడ్డు నిర్మించండి

» పాత వెంకోజీపాలెం గ్రామ సేవా సంఘం, శ్రీసీతారామసేవా సంఘం ప్రతినిధుల వినతి



ఏడీసీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామ సేవా సంఘం సభ్యులు

వెంకోజీపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 15వ వార్డులోని పాత వెంకోజీపాలెంలోని గ్రామ సేవా సంఘం, శ్రీ సీతారామసేవా సంఘంల వారికి సంబంధించిన శ్మశాన వాటికకు రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామ సేవా సంఘం సభ్యులు సోమవారం జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ డీవీ రమణమూర్తికి వినతిపత్రం అందజేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో సంఘం సభ్యులు వినతి పత్రం ఇచ్చి సమస్యను వివరించారు. తాత ముత్తాతల నుంచి వాడుకలో ఉన్న శ్మశాన వాటిక ఎటువంటి అభివృద్ధి లేకుండా ఉందని, కనీస సౌకర్యాలు లేక మృతదేహాన్ని తీసుకువెళ్లినప్పుడు ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని ఏడీసీకి వివరించారు. కోర్టు కేసులో ఉందని తమ శ్మశాన అభివృద్ధిని మరుగన పడవేశారని, వెంటనే దీనిని పరిష్కరించాలని తమ గ్రామ ప్రజలకు న్యాయం చేయాలని ఏడీసీని కోరారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఎప్పటి నుంచో కోరుతున్నామని, అయినప్పటికీ పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ ఇబ్బందులు గుర్తెరిగి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సంఘం అధ్యక్షులు ఆడారి సత్యనారాయణ, ప్రధానకార్యదర్శి పీల ప్రేమ్‌కిరణ్ జగదీష్, కార్యదర్శి మళ్ల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన అవసరం

» కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చి



జ్యోతి వెలిగిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, చిత్రంలో కలెక్టర్ హరేంధిరప్రసాద్, తదితరులు

బీచ్ రోడ్డు, అక్టోబరు 13, (ఆంధ్రజ్యోతి): గుండె సంబంధిత వ్యాధులతో ప్రజల ప్రాణాలు పోతున్నాయని, అత్యవసర సమయంలో సీపీఆర్ చేయడం ద్వారా ఎంతోమందిని బతికించే అవకాశం ఉంటుందని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఆర్కే బీచ్‌లో నిర్వహించిన సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సీపీఆర్ అంటే కార్డియో పల్మనరీ రెసిస్టేషన్ అని, గుండె కొట్టుకోవడం ఆగిపోయిన వ్యక్తి మెదడుకు ఆక్సిజన్‌తో కూడిన రక్తాన్ని తాత్కాలికంగా ప్రసారం చేసే అత్యవసర చికిత్స అని వివరించారు. ఆడుతూ, పాడుతూ కళ్ల ముందే తిరిగేవారు చూస్తుండగానే క్షణాల్లో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు తరచూ చూస్తున్నామన్నారు. ప్రపంచంలో ఏటా సుమారు ఆరు లక్షల మంది గుండెపోటుతో మరణిస్తున్నారని ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ సీపీఆర్‌పై అవగాహన అవసరమన్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ సీపీఆర్ నేర్చుకుని, ఆపదలోని వారి ప్రాణాలు కాపాడాలన్నారు. 17 వరకు సీపీఆర్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సి.బాల సతీష్ మాట్లాడుతూ సీపీ ఆర్ టెక్నిక్‌ను నేర్చుకోవడానికి, నైపుణ్యం పొందడానికి శిక్షణ అవసరమన్నారు. అనం తరం కాళికామాత ఆలయం నుంచి వైఎంసీఏ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ మురళీకృష్ణపట్నాయక్, డాక్టర్ ఎం.లక్ష్మి, కార్యదర్శి రవికుమార్ పాల్గొన్నారు.

జీవీఎంసీ పీజీఆర్‌ఎస్‌కు 100 వినతులు



జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న ఏడీసీ రమణమూర్తి

వెంకోజీపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) :జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నగర వ్యాప్తంగా 100 వినతులు వచ్చాయి.ప్రధాన కార్యాలయంలో అడిషనల్ కమిషనర్ డీవీ రమణమూర్తి వినతులను స్వీకరించి, మూడు రోజుల్లో సమస్యలు పరిష్కారం కావాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

వీఎంఆర్డీఏలో..



వినతులు స్వీకరిస్తున్న ప్రణవ్‌గోపాల్

సిరిపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు సత్వర పరిష్కారమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ అన్నారు. సోమవారం వీఎంఆర్డీఏ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ఆయన పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. మొత్తం ఆరు వినతులు రాగా, వాటిని పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేశ్, ప్రధాన ఇంజనీర్ వినయ్‌కుమార్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నేడు ఆరిలోవ రైతుబజార్‌కు సెలవు



ఆరిలోవ రైతుబజార్

ఆరిలోవ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ రైతుబజార్‌కు ప్రతి మంగళవారం సెలవు దినంగా ఖరారు చేసినట్టు ఎస్టేట్ అధికారి నాయుడు తెలిపారు. ఈనెల 1న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జేసీ మయూర అశోక్‌తో కలసి ఈ బజార్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ రైతు బజార్‌కు కొనుగోలు దారుల నుంచి చక్కని స్పందన లభిస్తోందని ఎస్టేట్ అధికారి తెలిపారు. ఈ క్రమంలో నిబంధనల మేరకు ఈ బజార్‌కు పరతి మంగళవారం సెలవుదినంగా పాటించనున్నట్టు తెలిపారు. ఆరిలోవలోని బాలాజీ నగర్‌లో మంగళవారం సాయంత్రం పెద్ద సంత కూడా జరుగుతుంది. వీటిని దృష్టికి పెట్టుకొని మంగళవారం సెలవుగా అధికారులు నిర్ణయించినట్టు ఎస్టేట్ అధికారి నాయుడు తెలిపారు.

స్టీల్‌సిటీ డిపో లీజు వ్యవధి పెంచాలి

» ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఎంప్లాయీస్ యూనియన్



కలెక్టరేట్ వద్ద స్టీల్ సిటీ డిపో యూనియన్ సభ్యులు

మహారాణిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌సిటీ బస్ డిపో లీజు వ్యవధి పెంచాలని, సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలన్న నిబంధనల సడలిం పునకు కృషిచేయాలని ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ కూర్మన్నపాలెం కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్‌ఎస్‌లో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు కేఎస్ ప్రకాశ్ మాట్లాడుతూ 1990లో కూర్మనపాలెం వద్ద ఆర్‌ఐఎన్ఎల్ లీజే భూమిలో స్టీల్‌సిటీ డిపోను నిర్మించారని, రోజుకు 80 బస్సు ల ద్వారా సేవలు అందేవన్నారు. డిపో ద్వారా ఏడాదికి రూ.12 కోట్లు నష్టాలు వస్తున్నా, ప్రజలు, ఉద్యోగుల అవసరాల రీత్యా కొనసాగిస్తున్నారన్నారు. ప్రస్తు తం ఆర్‌ఐఎన్ఎల్ అధికారులు ఒకేసారి ప్రీమియం సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.133.39 కోట్లు చెల్లించాలని పట్టుబడుతున్నారని 30 సంవత్సరాల లీజు కా లానికి సేవా చార్జీల పేరిట 5.3 కోట్లు చెల్లించాలంటున్నారన్నారు. ఇంత పెద్ద మొత్తంలో చెల్లింపులు ఆర్టీసీకి సాధ్యం కాదని, కలెక్టర్ చొరవ తీసుకుని డిపోను కాపాడాలని, మరో 33 ఏళ్ల లీజు పొడిగించేలా చూడాలని కోరారు.

బడ్డీల ఆక్రమణ కథ మళ్లీ మొదటికి!


మాధవధార ఉడాకాలనీ మూడు రోడ్ల జంక్షన్‌లో రోడ్డును ఆక్రమించి వేసిన దుకాణాలు


మురళీనగర్ ఎన్‌జీజీవోస్ కాలనీలో రోడ్డెక్కిన ఫాస్ట్‌ఫుడ్ దుకాణం


మాధవధార ఉడా కమ్యూనిటీ హాలు వద్ద ఏర్పాటైన కంటైనర్ దుకాణాలు

మురళీనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరులో జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ యమ స్పీడుగా రోడ్లపై ఆక్రమణలు తొలగించడంతో రాకపోకలకు మార్గం సుగమమైంది. 'ఆపరేషన్ లంగ్స్ 2.0' పేరుతో చేపట్టిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమంతో రహదారులకు ఇరువైపులా ఉన్న కాలువ మార్గాలు పూర్తిగా ఫ్రీ అయ్యాయి. రోడ్లకు ఇరువైపులా ఉన్న కాలువలు, ఫుట్ పాత్‌లు సరిచేయడంతో నడకదారులకు, వాహనదారులకు ఉపశమనం లభించింది. అయితే, ఈ నెల 2కి ముందు దసరా సెలవులలో ఆపేసిన ఈ ఆపరేషన్ లంగ్స్ 2.0 కార్యక్రమం అనంతర చర్యలు తిరిగి ఆరంభించలేదు. విశాఖ ఉత్తర నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్లుగా ఉన్న ఊర్వశి జంక్షన్ ఆర్‌అండ్‌బీ హైవే, మాధవధార ఉడాకాలనీ, ఆర్టీఏ కార్యాలయం, ఉడాకాలనీ ప్రాంతాల్లో ఇప్పటికీ ఆక్రమణలు తొలగించలేదు. జోన్-5 పరిధిలోని మాధవధార, మురళీనగర్ ఎన్‌జీజీవోస్ కాలనీ మెయిన్‌రోడ్ ప్రాంతాల్లో తొలగించిన బడ్డీలను వ్యాపారులు తిరిగి యథాస్థానంలోకి తీసుకొచ్చారు. మూడు రోడ్ల కూడలిగా ఉన్న మాధవధార ఉడా కాలనీ కమ్యూనిటీ హాలు వద్ద ఫంక్షన్ హాలు వంటశాలను ఆనుకొని దుకాణాలు ఇటీవలే ఏర్పాటు చేశారు. బడ్డీలు కంటైనర్ మోడల్స్‌లో తీసుకొచ్చి నేరుగా కాలువ గట్లు దాటించి, రోడ్డు ఫ్రీ లెఫ్ట్ మలుపు వద్ద ఏర్పాటు చేయడంతో వాహనదారులు మళ్లీ ఇబ్బందులు పడుతున్నారు. బస్టాపును ఆనుకొనే వ్యాపారం చేసుకుంటున్నారు. వీరికి ఈ నెల ఆరంభంలో కరెంటు కనెక్షన్ కూడా కట్ చేసి దుకాణాలు స్వచ్ఛందంగా తొలగించాలని చెప్పినా, కాలనీ అసోసియేషన్ సభ్యుల మద్దతు ఉందంటూ జీవీఎంసీ సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు. మురళీనగర్ ఎన్‌జీజీవోస్ కాలనీ రోడ్డులో నూడిల్స్ దుకాణం నిర్వాహకుడి తీరుతో బస్టాపు వద్ద ప్రయాణికులు వేచి ఉండేందుకు చోటు ఉండటం లేదు. కాలువలపై తొలగించిన చోటే తిరిగి వ్యాపారాలు ప్రారంభించారు. అధికారులు చర్యలు తీసుకోకుంటే ఆపరేషన్ లంగ్స్ ఆరంభశూరత్వంగా మిగిలిపోయే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు.

ఆసియా మాస్టర్స్ బెంచ్ ప్రెస్ టోర్నీలో ప్రసాద్, రాములకు పతకాలు


ఎ.వై.ప్రసాద్


డి.రాము

విశాఖపట్నం స్పోర్ట్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆసియా మాస్టర్స్ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన ఎ.వై.ప్రసాద్, డి.రాము పతకాలు సాధించారు. హాంగ్‌కాంగ్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో భారత్ జట్టుకు వీరు ప్రాతినిధ్యం వహించారు. సోమవారం జరిగిన 83 కిలోల విభాగంలో ప్రసాద్, 120 ప్లస్ కిలోల విభాగంలో డి.రాము రజత పతకాలు సొంతం చేసుకున్నారు. అంతర్జాతీయ బెంచ్‌ప్రెస్ ఈవెంట్‌లో దేశానికి పతకాలు అందించిన ప్రసాద్, రాములను ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ సంఘం ప్రతినిధులు ఎస్.కోటేశ్వరరావు, సకల సూర్యనారాయణ, గంట వెంకటేశ్వర్లు, ఎం.ప్రభాకరరావు, సంజీవ్, శేషుబాబు తదితరులు అభినందించారు.

జాతీయ అథ్లెటిక్స్ మీట్‌లో శేషుబాబుకు పతకం


విజేత శేషుబాబుతో కోచ్ పుష్పరాజు

విశాఖపట్నం స్పోర్ట్స్ అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ టోర్నీలో నగరానికి చెందిన డి.శేషుబాబు పతకం సాధించాడు. భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో సోమవారం జరిగిన అండర్-18 పురుషుల 200 మీ. పరుగులో శేషుబాబు అద్భుతమైన రేస్‌తో కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. నగరంలో సీనియర్ కోచ్ పి.పుష్పరాజు వద్ద శిక్షణ పొందుతున్న శేషుబాబు...పటిష్ఠమైన ప్రత్యర్థులతో తలపడ్డాడు. ఈ సందర్భంగా జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రతినిధులు డి.నాగేశ్వరరావు, కార్యదర్శి ఎం.నారాయణరావు, ఇతర ప్రతినిధులు శేషబాబు, కోచ్ పుష్పరాజులను అభినందించారు.

విద్యుత్ దీపాల కోసం వినతి


ఏడీసీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

కంచరపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వ వార్డులో మసకబారిన విద్యుత్ దీపాల స్థానంలో కొత్త దీపాలు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్ గంకల కవిత సోమవారం అధికారులను కోరారు. పీజీవీఆర్‌ఎస్‌లో జీవీఎంసీ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పాత వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. మంచినీటి సరఫరా కోసం తవ్వి వదిలేసిన గోతులు పూడ్చాలని కోరారు. అసంపూర్తిగా వదిలేసిన రోడ్డు నిర్మాణ పనులను పూర్తిచేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు గంకల అప్పారావు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

మురళీనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈపీడీసీఎల్ మురళీనగర్ సబ్ స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. శ్రీనివాసనగర్ ఏరియాలో 76 ట్రాన్స్‌ఫార్మరు వద్ద విద్యుత్ కండక్టరుపై చెట్లు పడటంతో మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపేసి పనులు చేపట్టారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి గంటన్నర పాటు సరఫరా లేదు. ముందస్తు ప్రకటన చేయలేదు. 76 సమస్యాత్మక ట్రాన్స్‌ఫార్మరు పరిధిలో వర్షాల కారణంగా ఏర్పడుతున్న ఇబ్బందులను పరిష్కరించేలా పనులు చేపట్టినట్లు సబ్‌స్టేషన్ సిబ్బంది తెలిపారు.

కార్యకర్త కుటుంబానికి కార్పొరేటర్ వితరణ


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న శ్రీధర్

జ్ఞానాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 41వ వార్డులో నివాసం ఉంటున్న మేరీ కార్మెల్ డేవిడ్ భర్త మృతి చెందడంతో కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ, వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ అంతిమ సంస్కార ఖర్చులకు రూ.10 వేలు అందించారు. రూ.10 వేలు పోషణకు, జ్ఞాపకార్థ కూడికకు కావాల్సిన భోజన సదుపాయాల ఖర్చు భరిస్తామని భరోసా ఇచ్చి రూ.35 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వ పింఛన్ అందేవరకు ఇంటి అద్దె తానే చెల్లిస్తానని, వైసీపీ కార్యకర్తలు ఎవరికి ఏం జరిగినా అండగా ఉంటానన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కంచరపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన బత్తిన ఈశ్వరరావు కుటుంబ పరిస్థితిని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చేస్తామని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి ఈతలపాక సుజాత తెలియజేశారు. గాంధీనగర్‌లో ఈశ్వరరావు కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. గంట్యాడ వీరుబాబు, గోవింద్, గణేష్ పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో వసతుల కల్పనకు కృషి చేస్తా

▸▸ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్


కళాశాలలో ఆర్‌వో వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

డాబాగార్డెన్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో వసతుల కల్పనకు కృషి చేస్తానని, ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం డాబాగార్డెన్స్ పాత జైల్‌రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించి మాట్లాడారు. నిరంతరం విద్యార్థులకు నాణ్యమైన బోధనతో పాటు పౌష్టికాహారాన్ని అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆర్‌వో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన వేదాంత కంపెనీకి ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ, అధ్యాపకులు, నాయకులు పాల్గొన్నారు.

రాంజీ ఎస్టేట్ పాఠశాలకు నలుగురు ఉపాధ్యాయులు


కొత్త ఉపాధ్యాయులకు స్వాగతం పలుకుతున్న ఆనంద్, గణపతి

కంచరపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ రాంజీ ఎస్టేట్ ప్రాథమికోన్నత పాఠశాలకు కొత్త ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. ప్రజల డిమాండ్ మేరకు గతంలో ఇక్కడ ఉన్న ప్రాథమిక పాఠశాలను అప్పర్ ప్రైమరీగా విద్యాశాఖ నాలుగు నెలల క్రితం వర్గోన్నతి చేసింది. కానీ ఉపాధ్యాయులను కేటాయించలేదు. దీంతో ఉన్న ఉపాధ్యాయులపై అదనపు పనిభారం పడేది. ఈ నేపథ్యంలో విద్యార్థులు అవస్థలు పడేవారు. ఇటీవల ప్రభుత్వం మెగా డీఎస్సీ నిర్వహించిన సంగతి తెలిసిందే. రాంజీ ఎస్టేట్ పాఠశాల్లో నాలుగు ఖాళీలు చూపించడంతో నలుగురు ఉపాధ్యాయులు ఈ పాఠశాలకు తమ అంగీకారాన్ని తెలిపి సోమవారం విధుల్లో చేరారు. నూతన ఉపాధ్యాయులకు పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం గంట్యాడ ఆనంద్, గణపతి తదితరులు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు.

కుండపోత వర్షానికి రోడ్లు జలమయం


నరసింహనగర్ రైతుబజారులో వర్షపు నీరు


శ్రీనివాసనగర్‌లో గుంతల రోడ్డులో బురద

అక్కయ్యపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తర నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం అర్ధరాత్రి దాటాక, సోమవారం వేకువన కుండపోతగా కురిసిన వర్షానికి వివిధ ప్రాంతాల్లోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీనివల్ల రాకపోకలు సాగించే వాహనచోదకులు, పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అక్కడక్కడ రోడ్లు గుంతలు పడడంతో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గుంతల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో చాలా మెల్లగా వెళ్లాల్సి వచ్చింది. నరసింహనగర్ రైతుబజారులో కూడా వర్షపు నీరు నిలిచిపోవడంతో కూరగాయలను కొనుగోలు చేసేందుకు వచ్చిన కొంత మంది వినియోగదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. వర్షం కురవడంతో రైతులకు బేరాలు లేక తీసుకొచ్చిన కూరగాయలు అలాగే మిగిలిపోయాయి. దీంతో రైతులు వినియోగదారుల కోసం ఎదురు చూపులు చూశారు.

పోలీసు కమిషనరేట్‌కు 120 ఫిర్యాదులు

మహారాణిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పోలీసు కమిషనరేట్‌లో సోమవారం 120 ఫిర్యాదులు స్వీకరించారు. కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్వయంగా ఫిర్యాదుదారుల సమస్యలు ఆలకించి దరఖాస్తులు స్వీకరించారు. వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి సమస్యను చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు.

సీజేపై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై దాడికి పాల్పడిన న్యాయవాదిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు.

అతీగతీ లేని అదానీ డేటా సెంటర్

... 5వ పేజీ తరువాయి

ప్రహరీ నిర్మాణం మాత్రమే చేస్తున్నారు. ఇతరత్రా పనులు ఏమీ చేయడం లేదు. ఇప్పట్లో అదానీకి ఇక్కడ డేటా సెంటర్ నిర్మించే ఆలోచన లేదని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

నోటీసులు ఇస్తాం: ఏపీఐఐసీ అధికారి

భూమి స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి మూడేళ్లలో ఆపరేషన్లు చేపట్టాలనే నిబంధనతో ఒప్పందం జరిగింది. ఇప్పటికే రెండేళ్లు అయ్యింది. పనులు ప్రారంభించకపోతే త్వరలోనే నోటీసులు ఇస్తాం. జరిమానా చెల్లించి ఒప్పందం పునరుద్ధరించుకోవలసి ఉంటుంది.

కాన్వెంట్ కూడలి వద్ద ఇదీ రహదారి 'సొగసు'


ఛిద్రమైన రోడ్డు

జ్ఞానాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ జోన్-4 పరిధిలోని కాన్వెంటు కూడలి నుంచి డాబాగార్డెన్స్ అంబేడ్కర్ కూడలికి వచ్చిపోయే రహదారులు చాలా చోట్ల ఛిద్రమవడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. నిత్యం ద్విచక్రవాహనాలు, ఆర్టీసీ బస్సులు, వందల సంఖ్యలో ఆటోలు, భారీ వాహనాలు ఈ రహదారుల గుండా రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే వీటికి సరైన దారి లేదు. గత ఏడాది చివర్లో ఈ రహదారులకు మరమ్మతు చేసినా నాణ్యతా లోపంతో చిన్నపాటి వర్షాలకే ఛిద్రమై చాలాచోట్ల గుంతలు పడి వాహనదారులకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. కొత్తగా ఈ రహదారిలో వచ్చేవారు గోతుల సంగతి తెలియక అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. శాశ్వత ప్రాతిపదికన రోడ్లు వేయకుండా ముఖ్యమంత్రి, మంత్రులు వచ్చే సమయంలో తూతూమంత్రంగా రోడ్డు నిర్మించడంతోనే ఇలా ఛిద్రమవుతున్నాయని స్థానికులు అంటున్నారు.


ఈ మార్గం అంతా గతుకులమయమే

మద్యం బెల్ట్ షాపులు అరికట్టాలని వైసీపీ డిమాండ్


ఆందోళన చేస్తున్న వైసీపీ శ్రేణులు

మహారాణిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బెల్ట్ షాపులను అరికట్టి కల్తీ మద్యం కుంభకోణంపై సీబీఐ విచారణ జరిపించాలని దక్షిణ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేషకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ మిథనాల్ 7 శాతం ఉంటున్నందున మద్యం తాగే వారిలో చూపుకోల్పోయి, ఊపిరితిత్తులు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ అజమాయిషీలో మద్యం విక్రయాలు జరపడం వల్ల అమ్మకాలలో నియంత్రణ ఉండేదని, కూటమి పాలనలో బెల్ట్ షాపులు విపరీతంగా పెరిగాయని మండిపడ్డారు. కల్తీ మద్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు దిక్కెవరని ప్రశ్నించారు. ఇంతమంది ప్రాణాలు కోల్పోతున్నా పవన్‌కల్యాణ్‌కు కనిపించటం లేదా? అని ప్రశ్నించారు. నిరసన కార్యక్రమంలో వైసీపీ నాయకులు, ఆ పార్టీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలపై సంతకాల సేకరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైసీపీ నేత బానాల శ్రీనివాసరావు తదితరులు

అక్కయ్యపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల నుంచి సంతకాలు సేకరిస్తున్నామని జీవీఎంసీ ఫ్లోర్‌లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బానాల శ్రీనివాసరావు అన్నారు. వార్డు వైసీపీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఇతర నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యార్థి విభాగం సెక్రటరీ బానాల తరుణ్‌కుమార్, వైసీపీ వార్డు అధ్యక్షుడు హబీబ్, బానాల యువసేన సభ్యులు పాల్గొన్నారు.

రైతుబజారుకు రెండుపూటలా రాలేం

▸▸ మధ్యాహ్నం ఆదాయం రానందున ఉదయం మాత్రమే వస్తామని రైతుల అభ్యర్థన

అక్కయ్యపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 45వ వార్డు నరసింహనగర్ రైతుబజారులో ఉదయం వేళ కూరగాయలు విక్రయిస్తున్న తమను యథావిధిగా ఉంచాలే తప్ప మార్చరాదని రైతులు ముక్తకంఠంతో చెబుతున్నారు. రైతుబజారులో ఉన్న రైతులందరినీ ఉదయం, సాయంత్రం సమయాల్లో కూరగాయలు విక్రయించాలని అధికారులు చెబుతున్నారని, అలా అయితే తమకు చాలా ఇబ్బంది ఎదురవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం సాయంత్రం వస్తున్న రైతులకు బేరాలు సరిగ్గా లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారంటున్నారు. ప్రస్తుతం సాయంత్రం వస్తున్న వారు రైతుబజారు కార్డుకోసం దరఖాస్తు చేసుకున్నప్పుడు ఎప్పుడు విక్రయించాలో అందులో పొందుపరుస్తారని, అటువంటిది మళ్లీ వారిని ఉదయం సమయంలో రైతుబజారుకు వచ్చి కూరగాయలు విక్రయించాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సాయంత్రం కాకుండా యథావిధిగానే ఉదయం వేళ తమను కూరగాయలు విక్రయించేలా తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అనంతరం వారు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజును కలిసేందుకు సీతమ్మధారలోని కార్యాలయానికి వెళ్లగా ఆయన అందుబాటులో లేకపోవడంతో బీజేపీ నాయకురాలు శ్యామలా దీపికను కలిసి వారి బాధను వెలిబుచ్చారు. స్పందించిన ఆమె రైతుబజారుకు మార్కెటింగ్ శాఖ చైర్‌పర్సన్ వస్తారని, సమస్యను వివరించాలన్నారు.


ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లేందుకు పయనమైన నరసింహనగర్ రైతుబజారు రైతులు

తవ్వి వదిలేసిన రోడ్డు.. వేలాడుతున్న విద్యుత్ వైర్లు!


నక్కవానిపాలెం ఎస్సీ లైన్‌లో ఇలా..


కిందికి వేలాడుతున్న విద్యుత్ వైర్లు

సీతమ్మధార, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 14వ వార్డు నక్కవానిపాలెంలో క్రాంతినగర్ శారదస్కూల్ వద్ద ఎస్సీ కాలనీ లైనులో కొద్ది రోజుల క్రితం రోడ్లు తవ్వి అలానే వదిలేశారు. దీంతో చుట్టుపక్కల నివాసిత ప్రాంతాల వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే మూడు నుంచి నాలుగు అడుగుల రోడ్డులో. ఒక మనిషి నడిచి వెళ్తే మరో మనిషి పక్కకు తప్పుకోవాలి. అలాంటి రహదారులను తవ్వి చాలాకాలం వదిలేయడంతో నడవడానికి కూడా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు తవ్వి పనులు చేపట్టినప్పటి నుంచి ఈ సీసీ రహదారిలో నడవలేని పరిస్థితి నెలకొంది. ఆ రోడ్డులో వెళితే జారి పడడం ఖాయమని అందరికీ అర్థమవుతుంది. ఇక్కడ విద్యుత్ వైర్లు ఇళ్ల మధ్యలో కిందికి వేలాడుతూ ఉంటాయి. వర్షం పడితే విద్యుత్ వైర్లు రాపిడి జరిగి నిప్పురవ్వలు రాలుతుంటాయని స్థానికులు ఆందోళనగా చెప్పారు. ఏమరుపాటుగా ఉంటే విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. అధికారులు ఈ సమస్యల నుంచి తమను గట్టెక్కించాలని ప్రజలు కోరుతున్నారు.

పడకేసిన ఏయూ ఆరోగ్య కేంద్రం

... 5వ పేజీ తరువాయి

పరిస్థితులు లేవని, అంబులెన్స్ అధ్వానంగా ఉందని పేర్కొన్నట్టు తెలిసింది. అలాగే, విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన లేకపోవడం వల్ల ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడినట్టు అభిప్రాయపడింది. ముఖ్యంగా డిస్పెన్సరీ ఏళ్ల తరబడి నిర్లక్ష్యానికి గురికావడం వల్లే ఈ పరిస్థితి దాపురించినట్టు తెలిపింది. వేలాది మంది విద్యార్థులు, సిబ్బందికి వైద్య సేవలు అందించే ఆస్పత్రిలో తగినంతమంది వైద్యులు, సిబ్బంది లేరని, అయినా అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని నివేదికలో పేర్కొంది. ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనతోపాటు సిబ్బంది నియామకం చేపట్టాలని, మందులు అందుబాటులో ఉంచడంతోపాటు విద్యార్థులకు సీపీఆర్‌తోపాటు ప్రాథమిక వైద్య సేవలు (ఫస్ట్ ఎయిడ్) అందించడంపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని కమిటీ సూచించింది. అయితే, ఈ నివేదికను ఆధారంగా చేసుకుని ఎటువంటి చర్యలు తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది.

పొదుపు సొమ్ము స్వాహా చేసిన నకిలీ ఆర్పీ

... 5వ పేజీ తరువాయి

మొదలుపెట్టారన్నారు. పొదుపు సంఘంలో పది మంది బ్యాంకు పుస్తకాలు, సంఘం రికార్డులు ఆమె తన వద్ద ఉంచుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘం ఏర్పాటు తరువాత తొలి ఏడాది రూ.లక్ష, ఆ తరువాత ఏడాది రూ.3 లక్షలు, ఇంకా మరోసారి రూ.7 లక్షలు రుణం తీసుకున్నామని, ప్రతినెలా క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించామన్నారు. సకాలంలో రుణం చెల్లించినందుకు ప్రభుత్వం తమకు ఇచ్చిన వడ్డీ రాయితీని ఆ ఆర్పీ స్వాహా చేశారని ఫిర్యాదులో ఆరోపించారు. ఇలా సుమారు రూ.1.5 లక్షల వరకు స్వాహా చేశారని, ప్రతినెలా పొదుపు కింద కట్టే రూ.200 ఆమె సొంతానికి వాడుకున్నారని వాపోయారు. ఆమె తీరుపై అనుమానం వచ్చి యూసీడీకి చెందిన అక్కయ్యపాలెం సీఈవోను సంప్రతిస్తే సదరు మహిళ ఆర్పీ కాదన్నారని పేర్కొన్నారు. తమతోపాటు మరో 12 సంఘాలను నకిలీ ఆర్పీ మోసం చేసిందని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్లే కాంట్రాక్టర్లు!

... 5వ పేజీ తరువాయి

బెదిరించడం చేస్తున్నారు. జోన్-8 పరిధిలో ముగ్గురు అవుట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు తమ కుటుంబసభ్యుల పేర్లతో పనులు చేస్తున్నారు. జోన్-5ఏలో ఒకరు, జోన్-3లో ఒకరు, జోన్-7లో ముగ్గురు వర్క్ ఇన్‌స్పెక్టర్లు పనులు చేస్తున్నారు. ఇక ఏఈలు కూడా క్షేత్రస్థాయికి వెళ్లకుండా వారు (వర్క్ ఇనెస్పెక్టర్లు) ఇచ్చిన వివరాలనే ఎం-బుక్‌లో నమోదుచేసి బిల్లు కోసం పంపించేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉత్తర నియోజకవర్గ పరిధిలోని వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఏళ్ల తరబడి ఒకేచోట ఉండిపోయారని, పలువురు అక్రమాలకు పాల్పడుతున్నందున వేరొక చోటకు మార్చాలని కోరుతూ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు స్వయంగా జీవీఎంసీ అధికారులకు లేఖ ద్వారా విజ్ఞప్తిచేశారు. కానీ అధికారులు మాత్రం ఇంతవరకూ దీనిపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. ఇదిలావుండగా డీఈగా పనిచేస్తున్న ఒక ఇంజనీరింగ్ అధికారి సైతం తన బావమరిదిని కాంట్రాక్టర్‌గా రిజిస్ట్రేషన్ చేయించి తన జోన్ పరిధిలో భారీగా పనులు చేసుకుంటున్నారు.

దక్షిణాఫ్రికా రెండో విజయం

... 5వ పేజీ తరువాయి

చెందింది. అయితే బంగ్లాదేశ్ పోరాట పటిమ ఆకట్టుకున్నది.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ బ్యాటర్లపై దక్షిణాఫ్రికా బౌలర్లు పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. బంగ్లా ఓపెనర్లు ఫర్గాన హక్ (30), రబ్యా హైదర్ (25) 16 ఓవర్లపాటు క్రీజులో నిలబడి తొలి వికెట్‌కు 50 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 20 పరుగుల తేడాలో ఓపెనర్లు ఇద్దరూ అవుట్ కావడంతో క్రీజులోకి వచ్చిన షర్మిన్ అక్తర్, కెప్టెన్ నిగర్ సుల్తానా (32) దక్షిణాఫ్రికా బౌలర్లపై దాడికి దిగి జట్టు స్కోరును 30 ఓవర్లలో వందకు చేర్చారు. నిగర్ సుల్తానా స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన షోర్న అక్తర్...షర్మిన్ అక్తర్ కలిసి వేగం పెంచడంతో 40 ఓవర్లలో జట్టు స్కోరు 150 పరుగులకు చేరింది. ఈ దశలో షర్మిన్ అక్తర్ 74 బంతుల్లో 6 బౌండరీలతో అర్ధ సెంచరీ పూర్తిచేసి అనూహ్యంగా రనౌటై పెవెలియన్‌కు చేరింది. షోర్నా అక్తర్ కేవలం 34 బంతుల్లో మూడు బౌండరీలు, మూడు సిక్సర్లతో అర్ధ సెంచరీ పూర్తి చేయడంతో బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్లకు 232 పరుగులు చేసింది.

అర్ధ సెంచరీలతో ఆదుకున్న మారిజానా కాప్, క్లో ట్రయాన్

లక్ష్య ఛేదనలో బంగ్లాదేశ్ బౌలర్లను ఎదుర్కోవడంలో దక్షిణాఫ్రికా బ్యాటర్లు తడబడ్డారు. కేవలం 78 పరుగులకు ఐదు వికెట్లు కోల్పోయిన దశలో మారిజానా కాప్ (56), క్లో ట్రయాన్ (62) అర్ధ సెంచరీలతో ఆదుకున్నారు. ఇద్దరూ క్రీజులో ఉన్నంతసేపు విజయం ఖాయమనుకున్న సమయంలో క్లో ట్రయాన్ రనౌట్ అవ్వడంతో మ్యాచ్ రసవత్తరంగా మారింది. చివరి మూడు ఓవర్లలో మ్యాచ్ ఫలితంపై ఉత్కంఠ నెలకొంది. చివరి ఓవర్‌లో ఎనిమిది పరుగులు చేయాల్సి వచ్చింది. నహీద్ అక్తర్ వేసిన ఓవర్‌లోని మూడో బంతిని డీ క్లెర్క్ లాంగ్ ఆన్ మీదుగా కొట్టగా బౌండరీ లైన్ వద్ద షోర్న అక్తర్ క్యాచ్ జారవిడిచింది. తర్వాత బంతిని సిక్సర్‌గా మలిచి జట్టుకు విశాఖలో వరుసగా రెండో విజయాన్నందించింది.

ఎకనామిక్ జోన్‌కు 20,000 ఎకరాలు

... 5వ పేజీ తరువాయి

నేపథ్యంలో కొన్ని సంస్థలు ఏపీ వైపు చూస్తున్నందున వారికి ఇబ్బంది లేకుండా రోడ్ కనెక్టవిటీ పెంచాలని లోకేశ్ కోరారు. కంపెనీలు వచ్చిన తరువాత కాకుండా ముందుగానే రహదారుల విస్తరణ, అవసరమైన ప్రాంతాల్లో నాలుగు నుంచి ఆరులైన్ల రోడ్ల ఏర్పాటు దిశగా దృష్టిసారించాలని ఆదేశించారు. కంపెనీల కార్యకలాపాలు ప్రారంభించిన తరువాత ట్రాఫిక్ సమస్య పెరిగితే స్థానికులు, ఉద్యోగుల నుంచి వ్యతిరేకత వస్తుందని, అందుకే ముందుగానే పక్కాగా రోడ్ కనెక్టవిటీ ఉండాలన్నారు. ఉత్తరాంధ్రలో ఐదు లక్షల ఉద్యోగాలు ఇస్తామని 2024 ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విషయాన్ని ఆయన సమావేశంలో గుర్తుచేశారు. అందుకు తగ్గట్టుగా పరిశ్రమలు తీసుకువస్తామన్నారు. ఈ వారంలో ఆస్ట్రేలియా వెళ్లి అక్కడ ఒక కంపెనీతో చర్చించనున్నామని వివరించారు. వచ్చే నెలలో విశాఖలో నిర్వహించనున్న పెట్టుబడులు సదస్సులో మరికొన్ని కంపెనీలతో ఒప్పందాలు జరగనున్నాయన్నారు. ఇదిలావుండగా విశాఖ జిల్లాలో 15 మాస్టర్ ప్లాన్ రహదారుల అభివృద్ధికి ఇప్పటికే వీఎంఆర్‌డీఏ అధికారులు నడుంబిగించారు. ఈ రోడ్లకు పొరుగు జిల్లాల నుంచి అనుసంధానం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారు. ఒక జిల్లాలో పరిశ్రమలు, మరో జిల్లాలో ఎయిర్‌పోర్టు, మరో జిల్లాలో భూములు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నాలుగు జిల్లాల మధ్య అనుసంధానం కోసం గ్రేటర్ విశాఖ ఎకనామిక్ జోన్ ఏర్పాటుచేస్తున్నారు.



ప్రత్యేక అలంకరణలో శివలింగం

శివాలయంలో ప్రత్యేక పూజలు

అగనంపూడి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెద మడకలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చేపట్టిన రుద్రాభిషేకాల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో భజనతో పాటు భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 10 వినతులు

గాజువాక, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో అధికారులు పది వినతులను స్వీకరించారు. జోనల్ పరిధిలో రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని, వీధి లైట్లు వేయాలని, కుక్కల బెడద నివారించాలని, ఫుట్‌పాత్‌లపై అక్రమ వ్యాపారాలను తొలగించాలని, తదితర సమస్యలపై ఆయా ప్రాంతాల ప్రజలు, ప్రజా సంఘాల ప్రతినిధులు వినతిపత్రాలను అందజేశారు. జడ్సీ శేషాద్రి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు.

ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

అగనంపూడి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలను ఆదివారం రాత్రి స్థానిక శాఖ ఆధ్వర్యంలో సీడబ్ల్యూసీ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు కేశవ్ బలీరాం హెడ్గేవార్, గురూజీ గోల్వాల్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు ప్రతినిధులు మాట్లాడుతూ హిందూ జాతీయవాద ఉద్యమంలో ఆర్ఎస్ఎస్ చారిత్రాత్మకంగా ప్రధాన పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు సత్యనారాయణ, శ్రీనివాసరావు, చిన్ని పూర్ణచంద్రరావు, జెర్రిపోతుల రమణ, తాతారావు, రవీంద్ర, ఎల్వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు ప్రారంభం

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 69వ వార్డు పరిధి హరిజన జగ్గయ్యపాలెం కాలనీలో గౌరీపరమేశ్వరుల ఉత్సవాలను సోమవారం వైభవంగా ప్రారంభించారు. ఇక్కడి పొలాల నుంచి సేకరించిన వరిదుబ్బుకు పసుపుకుంకుమలతో గౌరమ్మలా అలంకరించి మేళతాళాల నడుమ రామాలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అక్కడ ప్రత్యేక వేదికపై అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 25 వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా 20వ తేదీన నందీశ్వరులను ప్రతిష్ఠించనున్నట్టు కాలనీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వంగలపూడి గోపి, జి.రామాంజనేయులు, పి.రవి, పి.ప్రవీణ్, టి.నరసింగరావు, ఈశ్వరరావు, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **కానిస్టేబుల్** : జగదాంబ, రమాదేవి.
- **బల్టీ** : గోకుల్
- **కాంతార 2** : మెలోడి, శరత్, శ్రీరామా, శ్రీకన్య, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2(104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **ఓజీ**: శారదా, జగదాంబ, రమాదేవి, సంగం, లీలామహల్, కిన్నెర, కామేశ్వరి, వెంకటేశ్వర-1, 2, శ్రీకన్య-2, శ్రీకన్య హెవెన్-3, మినీ మోహిని (గాజువాక), శ్రీకాంతి, సుకన్య, మౌర్య (గోపాలపట్నం), ఎస్.వి.సి.లిఖిత (శ్రీహరిపురం)
- **మిరాయి**: జగదాంబ, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సౌజన్య(గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), కన్య (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఇడ్లీ కొట్టు** : శ్రీ వెంకటేశ్వర, రమాదేవి

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 19, టమాటా 25, వంకాయలు (తెలుపు) 36, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 36, పచ్చిమిర్చి 38, కాకరకాయలు 30, బీరకాయలు 36, ఆనపకాయ 20, కాలీఫ్లవర్ 38, క్యాబేజీ 20, క్యారెట్ 58, దొండకాయలు 38, బంగాళదుంపలు 26, అరటికాయ (పెద్దది) 8, మునక్కాడలు (కిలో) 70, అల్లం (పాతది) 76, బరబాటి 48, ముల్లంగి 28, నిమ్మకాయలు (కిలో) 60, బద్దచిక్కుడు 60, దోసకాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 65, కొబ్బరికాయ (పెద్దది) 40, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 32, క్యాప్సికమ్ 58, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 30, చిలగడదుంపలు 36, కంద 36, దేముడుచిక్కుడు 74, గోరుచిక్కుడు 40, కూరపెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడిఅల్లం 100, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 55.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	510
విజయనగరం	514
శ్రీకాకుళం	514

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270

ఉపాధి కల్పించకపోతే చనిపోవడానికి అనుమతివ్వాలి

- ఉక్కు నిర్వాసిత నిరుద్యోగుల విజ్ఞప్తి
- కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన



కలెక్టరేట్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులు

ఉక్కుటౌన్‌షిప్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్టీల్ ప్లాంట్ కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు కర్మాగారంలో ఉపాధి కల్పించాలని, లేకుంటే చనిపోయేందుకు అయినా అనుమతి ఇవ్వాలని కోరుతూ సోమవారం నగరంలోని కలెక్టరేట్ వద్ద ఉక్కు నిర్వాసిత నిరుద్యోగులు నిరసన ప్రదర్శన చేపట్టారు. స్టీల్ ప్లాంట్ కోసం తాము సర్వం కోల్పోయామని, కొంతమందికి ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులుగా ఉపాధి కల్పించారని... అయితే వీరిలో చాలామందిని ఇప్పుడు విధుల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి లేక కుటుంబాలతో జీవనం సాగించేందుకు అష్టకష్టాలు పడుతున్నామని వాపోయారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని స్వయంగా జిల్లా కలెక్టర్ ఉక్కు యాజమాన్యానికి చెప్పినప్పటికీ ప్లాంట్ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నిర్వాసిత నిరుద్యోగులు పితాని భాస్కరరావు, ఎన్.ప్రసాద్, కె.వంశీకృష్ణ, రామకృష్ణ, రమణ, అప్పలకొండ, గణేశ్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం: రహదారులు జలమయం

ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడిన ప్రజలు

పెదగంట్యాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పెద గంట్యాడ పరిసరాల్లో సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి పలు కాలనీల రహదారుల మీదుగా పెద్దఎత్తున నీరు ప్రవహించింది. వర్షపు నీటి సామర్థ్యానికి తగ్గట్టుగా డ్రైనేజీలు లేకపోవడంతో వీధి రోడ్లపై నీరు పారింది. సత్యనారాయణపురం, బాలచెరువు, డెయిరీ కాలనీ, బర్మా కాలనీ, నీలాపువీధి ప్రాంతాల్లోని రోడ్లపై నీరు ప్రవహించడంతో స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఇదే పరిస్థితి నెలకొంది.



పెదగంట్యాడ హెచ్‌బీ కాలనీలో కురుస్తున్న వర్షం

గాజువాక: గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు గాజువాకలోని పలు ప్రాంతాల రహదారులు చిత్తడి చిత్తడిగా మారాయి. పలుచోట్ల ప్రధాన రహదారులతో పాటు వీధి రోడ్లను వివిధ పనుల నిమిత్తం తవ్వి విడిచి పెట్టడంతో ఆయా రోడ్లన్నీ బురదమయంగా మారాయి. వర్షాలకు ఆయా రోడ్లపై గల గోతుల్లో నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన చిరుజల్లులకు విద్యార్థులు, కార్యాలయాలకు, పలు కంపెనీలకు విధులకు వెళ్లిన ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడ్డారు.

'అంబుజా'కు వ్యతిరేకంగా కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని వినతి



ఏడీసీకి సమస్యను వివరిస్తున్న సీపీఎం నాయకులు

పెదగంట్యాడ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పెదగంట్యాడ సమీపాన అంబుజా సిమెంటు గ్రైండింగ్ యూనిట్ ఏర్పాటును రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో తీర్మానం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అడిషనల్ కమిషనర్ రమణమూర్తికి సోమవారం వినతిపత్రం అందజేశారు. సిమెంటు కంపెనీ ఏర్పాటు నిమిత్తం ఈ నెల 8న చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణను స్థానిక ప్రజలంతా అడ్డుకున్నారని, దీంతో మరో 15 రోజుల్లో ఈ కార్యక్రమాన్ని చేపడతామని అధికారులు ప్రకటించారన్నారు. ఇక్కడ సిమెంట్ కంపెనీ ఏర్పాటైతే పెదగంట్యాడ, గంగవరం, గాజువాక, కూర్మన్నపాలెం, మల్కాపురం, శ్రీహరిపురం ప్రాంతాలు కాలుష్యంతో నిండిపోతాయని, భూగర్భ జలాలు కలుషితమవుతాయని, ప్రజలు పలు రోగాల బారినపడతారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రజాభిప్రాయ సేకరణకు ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వరాదని కోరుతూ కౌన్సిల్ తీర్మానం చేసేలా తగిన చర్యలు చేపట్టాలని ఏడీసీకి విజ్ఞప్తి చేశారు.

జోనల్ కార్యాలయానికి స్థలం కేటాయించాలని..

అగనంపూడి: అగనంపూడి వద్ద గల సబ్ నిర్మిత కేంద్రానికి చెందిన స్థలంలో జోన్-9 కార్యాలయానికి స్థలాన్ని కేటాయించాని కోరుతూ స్థానిక నాయకులు జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజల సౌలభ్యం కోసం 77, 78, 79, 85 వార్డులకు అగనంపూడి కేంద్రంగా ఏర్పాటు చేయనున్న కార్యాలయానికి శాశ్వతంగా భవన నిర్మాణాలకు ఇక్కడ అనుకూలంగా ఉంటుందన్నారు. ఇక్కడ కార్యాలయం ఏర్పాటు చేస్తే ప్రజలందరికీ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ఏడీసీని కలిసిన వారిలో స్థానిక నాయకులు బి.సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనుల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న ఏడీఎఫ్ఎం సతీశ్

కూర్మన్నపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): దువ్వాడ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు సౌకర్యాలను మరింత మెరుగుపరచడానికి, అమృత్ సంవాద్ 5.0 ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం వాల్తేరు అడిషనల్ డివిజినల్ ఫైనాన్స్ మేనేజర్ (ఏడీఎఫ్ఎం) జి.సతీశ్ అమృత భారత్ పథకం కింద స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై వారికి పలు సలహాలు, సూచనలు చేశారు. దువ్వాడ రైల్వే స్టేషన్ భవిష్యత్తులో రూపుదిద్దుకునే విధానాలను, భవిష్యత్తు ప్రణాళికలు, వసతుల గురించి వివరించారు. కార్యక్రమంలో జడ్ఆర్‌సీసీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, రైల్వే యూజర్స్ అసోసియేషన్ సభ్యులు వి.జాహ్నవి, విజయకుమార్, మానవేంద్రనాథ్, సరోజిని, చిన్నంనాయుడు, రైల్వే అధికారులు రవికిరణ్, సురేశ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామిక ప్రాంతంలో భారీ వర్షం

» జలమయమైన రహదారులు



హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద వరద నీరు



మల్కాపురం మెయిన్ రోడ్డుపై ఇలా...

మల్కాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక ప్రాంతంలో సోమవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి రహదారులన్నీ జలమయమయ్యాయి. మల్కాపురం, రామకృష్ణపురం, హెచ్‌పీ పెట్రోల్ బంకు ప్రాంతంలో కాలువల నుంచి వరద నీరు రోడ్డు పైకి చేరుకోవడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. పెట్రోల్ బంకుకు వాహనాలను వరద నీటి నుంచేవెళ్లాల్సి వచ్చింది. మల్కాపురం కృష్ణబార్ మార్గంలోని రెండు కాలువల్లో పూడిక పేరిగిపోవడంతో మురుగునీరు రోడ్డుమీదకు చేరింది. హెచ్‌పీసీఎల్ ఎంప్లాయీస్ గేటు వద్ద వరదనీరు భారీగా చేరింది. కాలువలను రోడ్డుకు సమాంతరంగా నిర్మించకపోవడంతో వర్షం పడిన ప్రతిసారీ ఇదే పరిస్థితి ఎదురవుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పరిస్థితిని సరిదిద్దాలని కోరుతున్నారు.

విశాఖను ఐటీ రాజధానిగా మార్చేందుకు సీఎం కృషి

» పశ్చిమ ఎమ్మెల్యే పీవీజీఆర్ నాయుడు (గణబాబు)



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరాన్ని ఐటీ రాజధానిగా తీర్చిదిద్దడంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు అన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తోందన్నారు. హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్‌ను తీసుకువచ్చినట్లుగా విశాఖలో గూగుల్ ఏర్పాటుకు చర్యలు చేపట్టడం ఉత్తరాంధ్ర ప్రజలకు వరమన్నారు. 26 కొత్త పారిశ్రామిక విధానాలు, సింగిల్ విండో సిస్టమ్ ద్వారా రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులు, 9 లక్షల ఉద్యోగావకాశాలు లభించాయని అన్నారు. రానున్న రోజుల్లో మరో ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించే చర్యలు చేపడుతున్నారన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారన్నారు. అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

'కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తున్న కేంద్రం'



గొడౌన్ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ నేత జగ్గునాయుడు

మల్కాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని సీఐటీయూ గోడౌన్స్ యూనియన్ల గౌరవాధ్యక్షుడు ఎం.జగ్గునాయుడు విమర్శించారు. డాక్‌యార్డు ఎదురుగా ఉన్న గోడౌన్స్ ప్రాంతంలో జరిగిన సిటూ సమావేశాల్లో సోమవారం ఆయన మాట్లాడారు. విశాఖలో డిసెంబరు 31 నుంచి జరిగే సిటూ 18వ అఖిల భారత మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. 44 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కేంద్రం కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర పన్నుతోందన్నారు. గోడౌన్స్‌లో కార్మికులు ఐక్యంగా ఉండడంతో వేతన ఒప్పందాలు చేసుకోగలిగారన్నారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీ అల్లు వెంకటరమణ, ఆఫీస్ బేరర్స్ జి.దేవుడుబాబు, జి.నాయుడు, ఎం.శ్రీనివాసరావు, మేస్త్రీలు, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన క్రీడా స్ఫూర్తితోనే అద్భుత విజయాలు

» నేవల్ సిస్టమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ హరప్రసాద్



ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నేవల్ సిస్టమ్స్ డైరెక్టర్ హరప్రసాద్

గోపాలపట్నం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కూడిన క్రీడాస్ఫూర్తి అలవర్చుకునేవారు విజయతీరాలను చేరుతారని నేవల్ సిస్టమ్స్ అండర్ మెటీరియల్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ హరప్రసాద్ అన్నారు. ఎన్ఎస్‌టీఎల్ వేదికగా డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న డీఆర్‌డీవో సెంట్రల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ 2025-26ను డాక్టర్ హరప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యాలకు ఎంతగానో దోహపడతాయన్నారు. ఉద్యోగుల్లో ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ డీఆర్‌డీవో పరిశోధన కేంద్రాల నుంచి 150 మంది ఆటగాళ్లతో 8 జట్లు టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయన్నారు. ఐదు రోజుల పాటు జరిగే పోటీలకు ఎన్ఎస్‌టీఎల్ ఆతిథ్యం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నిర్వాహక, వర్క్స్, స్పోర్ట్స్ కమిటీల చైర్మన్లు కె.రాజ్‌కుమార్, డాక్టర్ హెచ్ఎన్ దాస్, హేమంత్ బైస్, ఎన్ఎస్‌టీఎల్ సీఈ యూనియన్ అధ్యక్షుడు ఆకిరి సునీల్, జి.నాగభూషణం, సీహెచ్ ప్రసన్నకుమార్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



పూజలందుకున్న పైడితల్లమ్మ, కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

పైడితల్లమ్మకు సహస్ర కలశాభిషేకం

ఆటోనగర్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు పరిధి శ్రీనివాసనగర్, ఎర్రగడ్డ కాలనీ, శ్రామికనగర్ ప్రాంతాల ప్రజల ఇలవేల్పు శ్రీపైడితల్లమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఊరేగింపుతో తరలివచ్చి పైడితల్లమ్మకు సహస్ర కలశాభిషేకం చేశాక పంచామృతాభిషేకాలు జరిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తొలేళ్ల ఉత్సవం, చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక ప్రదర్శనల నడుమ అమ్మవారిని ఊరేగించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు బండారు సత్యారావు, బి.రమణ, మోహన్‌కృష్ణ, కేవీఎస్ శంకరరావు, ఆడారి రామకృష్ణ, కోటేశ్వరరావు, కర్రి రమణ, తదితరులు పాల్గొన్నారు.

భెల్‌లో గుర్తింపు యూనియన్ ఎన్నికలకు సిద్ధం

అక్కిరెడ్డిపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): భెల్ హెచ్‌పీవీపీలో గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికలకు రంగం సిద్ధమవుతున్నది. 2023లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన యునైటెడ్ ఫ్రంట్ (ఏఐటీయూసీ) పదవీ కాలం ముగిసినందున త్వరలోనే ఎన్నికలు నిర్వహించేందుకు డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్) సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా కర్మాగారంలోని రిజిస్టర్డ్ కార్మిక సంఘాలు తమ గుర్తింపు పత్రాలతో పాటు సభ్యుల జాబితాలను కర్మాగార యాజమాన్యానికి పది రోజుల్లోగా అందజేయాలని సోమవారం భెల్ హెచ్‌పీవీపీ యాజమాన్యానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. దీంతో కర్మాగారంలో ఎన్నికల వాతావరణం ప్రారంభమైంది. రెండేళ్లకొకసారి సీక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో జరిగే గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల్లో విజయం సాధించేందుకు అన్ని కార్మిక సంఘాలు ప్రణాళికలు రూపొందించుకుంటున్నాయి.

జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్



ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న బొండా జగన్

కూర్మన్నపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సూపర్ జీఎస్టీ తగ్గింపుతో పేదలందరికీ ఎంతో మేలు చేకూరిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు పరిధి శ్రీగణేష్ నగర్‌లో తూర్పు కాపు సంఘం ఆధ్వర్యంలో సోమవారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా సంఘ మహిళలతో కలిసి ఆయన పలు కాలనీలకు వెళ్లి ప్రజలకు జీఎస్టీపై అవగాహన కల్పించడంతో పాటు కరపత్రాలను పంపిణీ చేశారు. జీఎస్టీ శ్లాబ్‌లను తగ్గించడం శుభ పరిణామమన్నారు. దీనివల్ల నిత్యావసర సరకులతోపాటు ఇతర వస్తువుల ధరలు ఎలా తగ్గుతాయో వివరించారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు ఎస్ఎస్ విజయరామరాజు, నాయకులు బొట్టా ప్రకాశ్, డీవీ అప్పారావు, ప్రగడ దానయ్య, మాటూరి రాము, కాంద్రేగుల శ్రీను, పద్మ, భాను, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు పీఎంశ్రీ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు

పెందుర్తి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు అండర్ 14,17 విభాగంలో పెందుర్తి పీఎంశ్రీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల నక్కపల్లిలో జరిగిన అండర్ 17 హాకీ పోటీ ల్లో నలుగురు విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. కైలాసపురంలో జరిగిన అండర్ 14 హాకీ పోటీల్లో ఆరుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ క్రమంలో సోమవారం పాఠశాలలో విద్యార్థులను హెచ్ఎం చిన్నమ్మాయి, పీడీ వరహాలమ్మ, సిబ్బంది అభినందించారు.

వెంకటాద్రి హుండీ ఆదాయం రూ.5.42 లక్షలు

పెందుర్తి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటాద్రి శిఖరరపై కొలువైన ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు చేపట్టారు. 70 రోజులకు రూ.5,42,768 నగదు సమకూరిందని ఆలయ వర్గాలు తెలిపాయి. ఆలయంలో సంప్రదాయ రీతిన చాతుర్మాస్య దీక్షలు నిర్వహిస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 7 ఫిర్యాదులు

వేపగుంట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి):వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఏడు ఫిర్యాదులు అందాయని జెడ్సీ హెచ్.శంకరరావు తెలిపారు. 89వ వార్డు సర్వేనంబరు 101/2 గెడ్డలో చేపడుతున్న నిర్మాణాలు తొలగించాలని, 92వ వార్డు ఇందిరానగర్‌లో అక్రమ నిర్మాణం నిలుపుదల చేయాలని, 97వ వార్డు ఇంటి పన్నులో పేరు మార్పు చేయాలని, 98వ వార్డు సింహాచలం ఏరియాలో గెడ్డ ఆక్రమించి చేపడుతున్న నిర్మాణంపై చర్యలు చేపట్టాలని కోరారు. వీటిని సంబంధితశాఖాధిపతులకు పంపించి చర్యలు చేపడతామని జెడ్సీ వివరించారు.

స్టీల్ సిటీ డిపో లీజు వ్యవధి పెంచాలి



కలెక్టరేట్ వద్ద స్టీల్ సిటీ డిపో యూనియన్ సభ్యులు

మహారాణిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌సిటీ బస్ డిపో లీజు వ్యవధి పెంచాలని, సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలన్న నిబంధనల సడలింపునకు కృషిచేయాలని ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ కూర్మన్నపాలెం కమిటీ సభ్యులు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం పీజీఆర్ఎస్‌లో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు కేఎస్ ప్రకాశ్ మాట్లాడుతూ 1990లో కూర్మనపాలెం వద్ద ఆర్ఐఎన్ఎల్ లీజే భూమిలో స్టీల్‌సిటీ డిపోను నిర్మించారని, రోజుకు 80 బస్సుల ద్వారా సేవలు అందేవన్నారు. డిపో ద్వారా ఏడాదికి రూ.12 కోట్లు నష్టాలు వస్తున్నా, ప్రజలు, ఉద్యోగుల అవసరాల రీత్యా కొనసాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆర్ఐఎన్ఎల్ అధికారులు ఒకేసారి ప్రీమియం సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.133.39 కోట్లు చెల్లించాలని పట్టుబడుతున్నారని 30 సంవత్సరాల లీజు కాలానికి సేవా చార్జీల పేరిట 5.3 కోట్లు చెల్లించాలంటున్నారన్నారు. ఇంత పెద్ద మొత్తంలో చెల్లింపులు ఆర్టీసీకి సాధ్యం కాదని, కలెక్టర్ చొరవ తీసుకుని డిపోను కాపాడాలని, మరో 33 ఏళ్ల లీజు పొడిగించేలా చూడాలని కోరారు.

ఐటీఐల్లో ఐదో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్

కంచరపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో మిగులు సీట్లను భర్తీ చేసేందుకు వీలుగా ఐదో విడత కౌన్సెలింగ్ నిర్వహించేందుకు పారిశ్రామిక శిక్షణ సంస్థ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు జిల్లా ఐటీఐల ప్రవేశాల కన్వీనర్, కంచరపాలెం ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ వివరాలను వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో సమర్పించాలని సూచించారు. అభ్యర్థి ఎక్కడ చేరదలచుకుంటే ఆ ఐటీఐకు మాత్రమే దరఖాస్తు చేయాలన్నారు. సమీపంలోని ప్రభుత్వ ఐటీఐకు హాజరై ధ్రువపత్రాలు పరిశీలించుకుని, రశీదు పొందాలన్నారు. ఈనెల 17న దరఖాస్తులో పేర్కొన్న ఐటీఐలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. అభ్యర్థులకు మెసేజ్‌లు పంపే అవకాశం లేదని తెలిపారు.

'గ్రీన్ ఎకానమీతో ఆర్థిక వ్యవస్థ బలోపేతం'



అనురాధను సత్కరిస్తున్న ఏయూ ప్రొఫెసర్లు

విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రీన్ ఎకానమీ భారత ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిందని దేవదాయశాఖ మాజీ కమిషనర్ వైవీ అనురాధ పేర్కొన్నారు. సోమవారం ఏయూలోని పాలిటిక్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్స్ ఈ క్లాస్ రూమ్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లోకల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో ఎమర్జింగ్ ట్రెండ్ ఇన్ పబ్లిక్ పాలసీ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ సమాజంలో, ప్రభుత్వ విధానాల్లో మార్పులు వచ్చాయన్నారు. పట్టణీకరణతో నగరాల్లో పారిశుధ్య, అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. ఐపీఏ విశాఖ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎన్.సాంబశివరావు, సెక్రటరీ ప్రొఫెసర్ పేటేటి ప్రేమానందం అనురాధను సత్కరించారు.

నయన మనోహారం

లుంబిని పార్కులో అరవిరిసిన అందాలు

- మనసును కట్టిపడేసేలా తీర్చిదిద్దిన జీవీఎంసీ
- రూ.2.5 కోట్లతో ఆధునికీకరణ పనులు
- సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచేలా నిర్మాణాలు
- అయినప్పటికీ వేధిస్తున్న వసతుల కొరత


పార్కులో ఆకట్టుకుంటున్న గౌతమబుద్ధుని విగ్రహం

ఎంవీపీ కాలనీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎంవీపీ కాలనీ అప్పుఘర్ వద్ద ఉన్న లుంబినీ పార్కు ప్రకృతి అందాలకు చిరునామాగా మారి, సందర్శకులకు ఆహ్వానం పలుకుతోంది. ఇక్కడి అందమైన మొక్కలు, పూల రమణీయత చూపరులను కట్టిపడేస్తున్నాయి. పార్కులో నుంచి కనిపించే సముద్ర అందాలు మదిని దోచే స్థాయి. ఈ పార్కును ఇటీవల జీవీఎంసీ రూ.2.5 కోట్లతో అత్యంత సుందరంగా తీర్చిదిద్దింది. దీంతో సందర్శకుల సంఖ్య పెరుగుతోంది.

అప్పుఘర్ వద్ద జీవీఎంసీ నిర్మించిన లుంబినీ పార్కును 2017లో ప్రారంభించారు. సుమారు మూడెకరాల విస్తీర్ణంలో ఓపెన్ జిమ్, కూర్చోవడానికి సిమెంటు బెంచీలు, పిల్లలకు ఆట వస్తువులు ఇక్కడ ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఇక్కడ భారీ బుద్ధుని విగ్రహం, దాని చుట్టూ లాండ్ స్కేపింగ్ అత్యంత సుందరంగా తీర్చిదిద్దిరు. ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో పచ్చని, అందమైన పూల మొక్కలను ఆకర్షణీయంగా పెంచారు. నగరంలో సందర్శనీయ ప్రదేశాలకు కరువు లేదు. అయితే అందరినీ ఆకట్టుకునేలా లుంబినీ పార్కును తీర్చిదిద్దినప్పటికీ, సందర్శకుల సంఖ్య స్వల్పంగా ఉండడంతో పలు దఫాలు ఆధునికీకరణ పనులు చేపట్టారు. ఉద్యానవనాన్ని సర్వాంగ సుందరంగా మలిచినప్పటికీ, వసతులు, సౌకర్యాల లేమి కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో పార్కుకు ఒకసారి వచ్చిన వారు మళ్లీ రావడానికి పెద్దగా ఆసక్తి చూపించడం లేదనే వాదన వినిపిస్తోంది. అంతేకాదు లుంబినీ పార్కుపై పెద్దగా ప్రచారం కూడా లేకపోవడం కారణమే. నగరవాసుల్లో చాలా మందికి ఇక్కడో ఉద్యానవనముందని తెలియని పరిస్థితి.

కల్పించాల్సిన వసతులివీ...

ఉద్యానవనంలో అందమైన లైటింగ్ ఏర్పాటుచేయాలి. ఓపెన్ జిమ్‌లు ప్రతి చోటా ఉన్నాయి వాటివల్ల పెద్దగా ప్రయోజనం లేదు. దీంతో చిన్నారులకు మరిన్ని ఆట వస్తువులు ఏర్పాటు చేయాల్సి ఉంది. సాగరతీరాన్ని ఆనుకుని ఉన్నా, సందర్శకులు కూర్చుని ఆ అందాలను తిలకించేందుకు తగిన బెంచీలు ఏర్పాటుచేయలేదు. ముఖ్యంగా బీచ్ చూసేందుకు వీలుగా ఉన్న ప్రదేశం వద్ద ఎలాంటి సౌకర్యాలు లేవు. అదనపు ఆకర్షణలు ఏర్పాటుచేసి, మరింత ప్రచారం కల్పిస్తే ఉద్యానవనానికి ఆదరణ పెరుగుతుందని నగర వాసులు భావిస్తున్నారు.


పార్కులో ఆహ్లాదకర వనాల మధ్య సుందరంగా తీర్చిదిద్దిన వాకింగ్ ట్రాక్


పచ్చదనంతో నిండిన లుంబినీ పార్కు పరిసరాలు

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ బైక్ ర్యాలీ


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న జేసీఎల్ రామారావు

అక్కయ్యపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 'సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్' ప్రచారంలో భాగంగా సోమవారం కార్మిక శాఖ ఆధ్వర్యంలో భారీ వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా నూతన తరహా జీఎస్టీ సంస్కరణల ప్రయోజనాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ర్యాలీని కార్మికశాఖ సంయుక్త కమిషనర్ జేసీఎల్ రామారావు జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా పరిశ్రమ కేంద్రం, డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్, ప్రభుత్వ శాఖల అధికారులు, కార్మికశాఖ ఉప కమిషనర్ ఎం.సునీత తదితరులు పాల్గొన్నారు. ఇకార్ట్ స్విగ్గీ, రాపిడో, ఫ్లిప్ కార్ట్, ఊబర్, పోర్టర్ వంటి సంస్థల నుంచి వచ్చిన 150 మంది గిగ్, ప్లాట్‌ఫారం కార్మికులు, వీధి వ్యాపారులు, సచివాలయాల నుంచి యూసీడీ సిబ్బంది, కార్మిక సిబ్బంది పాల్గొన్నారు. సుమారు 5 కిలోమీటర్లకు పైగా దొండపర్తి, డీఆర్ఎం కార్యాలయం, సంగం శరత్, ఆర్టీసీ కాంప్లెక్స్, అంబేడ్కర్ సర్కిల్, జిల్లా కోర్టు, జగదాంబ జంక్షన్, కేజీహెచ్ మీదుగా కలెక్టర్ కార్యాలయం వద్ద ర్యాలీ ముగిసింది. సూపర్ జీఎస్టీ 2.0 ద్వారా లభించే తగ్గిన పన్ను రేట్లు, తక్కువ ఇన్‌పుట్ ఖర్చులు, పెరిగిన కుటుంబ పొదుపు వంటి ప్రయోజనాలను సూచించే బ్యానర్లు, కార్మిక వర్గాల మధ్య జీఎస్టీ సంస్కరణలు సానుకూల ప్రభావంపై అవగాహన కల్పించారు.

SHRIRAM Finance

రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్ ప్లాట్ నెం 14A, సౌత్ ఫేజ్,ఇండస్ట్రియల్ ఎస్టేట్ గిండి,చెన్నై-600032. నిర్వాహక కార్యాలయం: 6వ అంతస్తు(లెవల్ 2),భవనం సంఖ్య 02,బేరం క్యూ పార్క్,జనరల్4/1,TTC, థానే బేలాపూర్ రోడ్,ఘన్సోలి,నవీ ముంబై-400710

గోల్డ్ వేలం మరియు ఇన్విటేషన్ నోటీసు

ఈ క్రింద పేర్కొన్న రుణగ్రహీతలు గోల్డ్ ఆభరణాలు హామీపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (SFL) నుండి పొందిన రుణముల యొక్క బకాయిలను తిరిగి చెల్లించవలసినదిగా నోటీసులు పంపడం జరిగినది. కానీ వారు తమ బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు. ఈ హామీ పెట్టిన బంగారం ఆభరణాల యొక్క వేలంపాటను మేము వేలం వేస్తాము. ఈ వేలములో కంపెనీకి రావలసిన సొమ్ము కన్నా ఎక్కువ సొమ్ము వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీతకు చెల్లించటం జరుగుతుంది. తక్కువ వచ్చిన యెడల ఆ మొత్తాన్ని రుణగ్రహీత నుండి చట్టపరమైన చర్యల ద్వారా వసూలు చేయడం జరుగుతుంది. SFL ఈ క్రింది ఖాతాలలో వేటినైనా వేలం నుండి తొలగించటానికి మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా వేలం తేదీని మార్చడానికి అధికారం కలిగి ఉంటుంది.

AUCTIONDATE 23.10.2025,SHRIRAM FINANCE LTD,ZONAL OFFICE,D.NO-14-1-2/B,GROUND FLOOR,NOWROJI ROAD,MAHARANI PETA, VISAKHAPATNAM - 530002,

Loan A/C No	Customer Name	Loan A/C No	Customer Name
CHWTRPJ2504100001	RAJAMAHANTIH KESAVARAO	MRNPTPJ2504220009	INDU KOLLI
CHWTRPJ2504260003	MANGARAJU TEKU	MRNPTPJ2504220008	INDU KOLLI
CHWTRPJ2504300001	NOOKA TEDDU	MRNPTPJ2501290002	MANOJ KUMAR AKULA
MRNPTPJ2504110004	SUBRAMANYA SUCHITRA PATNALA	VIZA2PJ2504180001	SAI SATYANARAYANA RELLU
MRNPTPJ2504150001	RAJANA SATTI BABU	VIZA2PJ2504230003	PYDI MOUNIKA
MRNPTPJ2504160002	SAHEATH ALI MOHAMMED	VIZA2PJ2504280001	SIVA PRASAD YERRAVARAPU
MRNPTPJ2501210004	INDU KOLLI	GJWKAPJ2504240003	SWAPNA D

వేలం సమయం: 11.00 AM మరింత సమాచారం కోసం, నిబంధనలు, షరతులు మరియు వేలంలో పాల్గొనడానికి రిజిస్టర్ చేసుకోవటానికి, ఆసక్తిగల కొనుగోలుదారుడు శ్రీ ఎ.జగదీష్ ని సంప్రదించవచ్చు. సమయాభావముతో వేలము ఆ రోజు పూర్తి కాని యెడల మరుసటిరోజు అదే నియమ నిభంధనలకు లోబడి వేలము నిర్వహించబడును. కస్టమర్ మరణించినట్లయితే, వేలంకు సంబందించిన అన్ని షరతులు అతని/ఆమె చట్టపరమైన వారసులకు వర్తిస్తాయి.

తేది: 13.10.2025
స్థలం: విశాఖపట్నం

అధీకృత అధికారి
శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

AJC CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, SALA GOWTAM (Old Name) S/o. Sala Satya Venkata Ramana Rao. R/o : 2-207, Vidya Nagar, Valasapakala, Kakinada. Change my name from SALA GOWTAM (Old Name) To SALA GOWTHAM (New Name) hence forth I am Being Called as SALA GOWTHAM (New Name) for all purposes.

AJV_251075

CHANGE OF NAME

★ I, YERRA VANAJAKSHI (Old Name) W/o. Yerra Srikanth, R/o. : 49-15-7/7, F.No-402, Sree Simha Res., Lalitha Nagar, Visakhapatnam. Change my name from YERRA VANAJAKSHI (Old Name) to BOTHSA VANAJAKSHI (New Name) hence forth I am being Called as BOTHSA VANAJAKSHI (New Name) for all purposes.

AJV_251076

For Advertisement Contact :
9963231176
9966165093

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

అర్జీలు పునరావృతమైతే అధికారులదే బాధ్యత

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- పీజీఆర్ఎస్‌కు 271 వినతులు


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, అధికారులు

మహారాణిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అదికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా అధికారులతో సహా 271 వినతులను స్వీకరించారు రెవెన్యూ విభాగానికి 82, జీవీఎంసీకి 86 పోలీసు విభాగానికి సంబంధించి 15, ఇతర విభాగాలకు చెందిన 88 అర్జీలు అందాయని తెలిపారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెకర్ మాట్లాడుతూ గతంలో అందిన అర్జీలపై తీసుకున్న చర్యలను తెలుసుకున్నారు. వివిధ అంశాలపై సమీక్షించి మార్గదర్శకాలను జారీ చేశారు. అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి కృషిచేయాలని, మరోసారి అదే అర్జీ అందితే దానికి అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. రెవెన్యూ, ల్యాండ్ సర్వే, పోలీసు, జీవీఎంసీ విభాగాలకు సంబంధించి ఎక్కువ అర్జీలు వస్తున్నాయని, వాటికి శాశ్వత పరిష్కారం చూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యం

- ఏయూ వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్


హెల్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న వీసీ, ఇతర అధికారులు

విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని విద్యార్థులకు మెరుగైన ఆరోగ్యం అందించే విధంగా వైద్య సిబ్బంది పనిచేయాలని వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. ఏయూ డిస్పెన్సరీని ఆయన సోమవారం సందర్శించారు. నూతనంగా నియమితులైన ముగ్గురు వైద్యులు, ఇద్దరు ఫార్మసీ, ముగ్గురు నర్సింగ్ సిబ్బందికి దిశా, నిర్దేశం చేశారు. ప్రతి విద్యార్థికీ అత్యుత్తమ వైద్య సేవలను సత్వరం, సకాలంలో అందించాలని సూచించారు. అనంతరం హెల్త్ సెంటర్‌లో వసతులు, సేవలకు సంబం ధించిన విషయాలను తెలుసుకున్నారు. ప్రస్తుతం డిస్పెన్సరీ జనరల్ షిఫ్ట్‌లో ఇద్దరు వైద్యులు, మూడు షిఫ్టుల్లో ఒక్కొక్కరు చొప్పున 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలని ఆస్పత్రి పర్యవేక్షణాధికారి డాక్టర్ రామేశ్వరరావుకు సూచించారు. సాధారణ వైద్యులతోపాటు ముగ్గురు నిపుణులు సిద్ధంగా ఉన్నారన్నారు. చర్మ, ఎముకల, ఈఎన్‌టీ వైద్యులు నిర్దేశిత వేళల్లో సేవలందిస్తారన్నారు. ఆస్పత్రిలో అడ్వాన్స్‌డ్ మెడిసిన్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు, డాక్టర్ రామేశ్వర్, డాక్టర్ మూర్తి, ప్రొఫెసర్ శర్మ, ప్రొఫెసర్ ఈశ్వర్‌కుమార్, ప్రొఫెసర్ సుభాషిణి, డీఆర్ సాంబమూర్తి, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

పోర్టుపాలెం రోడ్డుకు టీడీఆర్ జారీ చేయొద్దు

- రూ.700 కోట్లు కొట్టేసేందుకు కూటమి ఎమ్మెల్యే కుట్ర
- జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్


ఫిర్యాదు అందజేస్తున్న మూర్తియాదవ్

విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 94వ వార్డు నాయుడుతోట జంక్షన్ నుంచి పోర్టుపాలెం రోడ్డు విస్తరణ పేరుతో టీడీఆర్ జారీ ప్రతిపాదనను రద్దుచేయాలని జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ జీవీఎంసీ ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదికలో సోమవారం ఫిర్యాదుచేశారు. నాయుడుతోట జంక్షన్ నుంచి పోర్టుపాలెం మీదుగా పద్మనాభరాజునగర్‌కు ఆంధ్రా సిమెంట్స్ పరిశ్రమ గతంలో రోడ్డు నిర్మించిందని వివరించారు. ఆ రోడ్డు మొత్తం దేవస్థానం, ప్రభుత్వభూమి, గయాలు, కొండపోరంబోకుగా రెవెన్యూ రికార్డుల్లో ఉందని, 40 ఏళ్ల కిందట మేహాద్రిగెడ్డ నుంచి పైప్‌లైన్ నిర్మించినపుడు ఎలాంటి పరిహారం అందజేయలేదని గుర్తుచేశారు. తాజాగా కూటమి ఎమ్మెల్యే ఒకరు రోడ్డు నిర్మించిన భూమి తమతోపాటు మరికొందరిదని టీడీఆర్ కోసం 2014 లో జీవీఎంసీకి దరఖాస్తుచేస్తే అధికారులు పరిగణనలోకి తీసుకోలేదని, ఇప్పుడు ఆమమేఘాల మీదగా జీవీఎంసీ అధికారులు ఆ రోడ్డుని వంద అడుగులు విస్తరించేందుకు ఆర్‌డీపీ చేయడంతోపాటు తొలిదశలో 40 అడుగులకు రూ.700 కోట్లు విలువైన టీడీఆర్ జారీచేసేందుకు ఫైల్ సిద్ధం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాధనాన్ని కొట్టేసేందుకు కూటమి ఎమ్మెల్యే చేస్తున్న కుట్రకు అడ్డుకట్టవేసి, తక్షణం టీడీఆర్ ప్రతిపాదనను వెనక్కితీసుకోవాలని లేదంటే, న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని మూర్తియాదవ్ వివరించారు.

రసవత్తర పోరు

- మహిళల వన్డే ప్రపంచ కప్‌లో సౌతాఫ్రికా జోరు


దక్షిణాఫ్రికా క్రీడాకారిణుల ఆనందం



వికెట్ తీసిన ఆనందంలో బంగ్లా మహిళలు


సౌతాఫ్రికా బ్యాటర్ డి క్లర్క్ విజయానందం


బంగ్లా బ్యాటర్ ఫర్గానాను అవుట్ చేస్తున్న దృశ్యం


బంగ్లా బ్యాటర్ షోమా అక్తర్ పరుగు

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరొకరికి గాయాలు


వెంకటేశ్ (ఫైల్)

కూర్మన్నపాలెం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. సీఐ కె.మల్లేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కణితి కాలనీకి చెందిన ఉక్కు ఉద్యోగి లక్ష్మీనారాయణ, హేమలత కుమారుడు వెంకటేశ్ (29) సింగపూర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల 5న ఇక్కడికి వచ్చాడు. ఈ నెల 16న సింగపూర్ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. కాగా ఆదివారం రాత్రి స్నేహితుడు మళ్ల సాయితో కలిసి గాజువాకలోని ఓ మిత్రుడి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. సోమవారం వేకు వజామున తిరిగి వస్తుండగా వడ్లపూడి బ్రిడ్జిపై ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. వారిని గుర్తు తెలియని వ్యక్తి అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించాడు. అప్పటికే వెంకటేశ్ మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు కానరానిలోకాలకు వెళ్లిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


త్రిమూర్తులు (ఫైల్)

తగరపువలస, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. తగరపువలస బాలాజీనగర్‌కు చెందిన పీసా త్రిమూర్తులు (37) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇం ట్లో ఉంటున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో డోర్ కర్టన్‌తో ఉరి వేసుకున్నాడు. మృతునికి రుతిక, ఈశ్వరప్రసాద్ (12) పిల్లలున్నారు. థైరాయిడ్, శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బంది పడేవాడని భార్య రాజేశ్వరి ఫిర్యాదులో పేర్కొంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, భీమునిపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువతిని రక్షించిన పోలీసులు

మహారాణిపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్యకు యత్నించిన యువతిని మహారాణిపేట పోలీసులు రక్షించారు. సీఐ దివాకర్ యాదవ్ తెలిపిన వివరాల మేరకు.. కంచరపాలెం ప్రాంతానికి చెందిన ఓ యువతి కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకునేందుకు గాను సోమవారం ఉదయం తీరానికి చేరుకుంది. విషయాన్ని గ్రహించిన కుటుంబసభ్యులు వెంటనే డయల్ 112కు సమాచారం ఇచ్చారు. స్పందించిన సీఐ దివాకర్ సిబ్బందితో కలిసి తీర ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. గోకుల్‌బీచ్ పార్కు వద్ద యువతి సముద్రం లోపలకి వెళ్తుండగా గమనించి రక్షించారు, అనంతరం పోలీసుస్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి, కుటుంబసభ్యులకు అప్పగించారు.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, స్పోర్ట్స్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పట్టుకుని అతని నుంచి 4.5 కిలోల గంజాయి సంచులను స్వాధీనం చేసుకున్నారు. ప్లాట్‌ఫామ్‌లపై తనిఖీలు నిర్వహిస్తుండగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన జగవీర్ సింగ్ రైల్లో ఢిల్లీకి గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించామని రైల్వే పోలీసులు తెలిపారు.

సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేయొద్దు: కలెక్టర్

విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టాన్ని నిర్లక్ష్యం చేయవద్దని, ఉద్యోగులంతా అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన వర్క్‌షాప్‌లో మాట్లాడుతూ స.హ.చట్టంలోని సెక్షన్ 4(1)బీ ప్రకారం సమాచారాన్ని తెలుగు, ఇంగ్లీష్‌లో ముద్రించి అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాల పునర్విభజన తరువాత విధిగా మొదటి అప్పిలేట్ అధికారి, పౌర సమాచార, సహాయ పౌర సమాచార అధికారులు బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. విభాగాధిపతులు సిబ్బందికి సదస్సులు నిర్వహించాలన్నారు. చట్టం సెక్షన్ 6 (1) ప్రకారం పౌర సమాచార అధికారి దరఖాస్తు స్వీకరించి, సమాచారాన్ని గడువులోగా స్వయంగా దరఖాస్తుదారుడికిగాని, పోస్టుద్వారా గానీ అందించాలన్నారు.

డాక్టర్ అప్పారావుకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు


లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ అప్పారావు

విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ ఈఎన్‌టీ వైద్య నిపుణుడు డాక్టర్ ఎస్‌కేఈ అప్పారావు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. ఈ నెల 10 నుంచి 13 వరకు విజయవాడలో జరిగిన 20వ సౌత్ జోన్ ఈఎన్‌టీ కాన్ఫరెన్స్‌కు దక్షిణాది రాష్ట్రాలకు చెందిన సుమారు 700 మంది ఈఎన్‌టీ వైద్యులు హాజరయ్యారు. సదసుల్లో వివిధ అంశాలపై చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ఈఎన్‌టీ సంఘానికి విశేష సేవలందించిన సీనియర్ ఈఎన్‌టీ సర్జన్, అంకోసా ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్‌కే ఈ అప్పారావును లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో సౌత్ ఇండియా ఈఎన్ టీ అసోసియేషన్ సత్కరించింది. అసోసియేషన్ నేషనల్ ప్రెసిడెంట్ డాక్టర్ ద్వైపాయన్ ముఖర్జీ ముఖ్య అతిథిగా హాజరై అవార్డు ప్రదానం చేశారు. అనంతరం డాక్టర్ అప్పారావు దేశ, విదేశాల్లో విజయవంతంగా చేసిన పలు శస్త్ర చికిత్సలను ప్రస్తావించి, ప్రశంసించారు.

ఆక్రమణలకు గురైన ఏయూ భూముల పరిశీలన


ఏయూ స్థలాలను పరిశీలిస్తున్న వీసీ రాజశేఖర్, ఇతర అధికారులు

విశాఖపట్నం, అక్టోబరు 13 (ఆంధ్ర జ్యోతి): మధురవాడ సమీప నగరంపాలెంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి చెందిన భూములు ఆక్రమణలకు గురైనట్టు అధికారులు గుర్తించారు. వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.రాంబాబు, డీన్ కె.శ్రీనివాసరావు, ఇంజనీర్స్ సిబ్బందితో కలిసి భూములను సోమవారం సందర్శించారు. ఇక్కడ ఏయూకు 137 ఎకరాలుంది. ఇందులో కొంతభూమి ఆక్రమణలకు గురైనట్టు, మరికొంత స్థలంలో అనధికారికంగా రహదారి నిర్మాణం జరుగుతున్నట్టు గుర్తించారు. సరిహద్దులను నిర్ధారించి భూమిని పరిరక్షించేచర్యలు చేపట్టాలని అధికారులకు వీసీ సూచించారు. హనుమంతువాక వద్ద ఉన్న బోటనీ ప్రయోగశాల స్థలాన్ని పరిరక్షించేలా హరిహద్దులను గుర్తించి, రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. విశ్వవిద్యాలయ భూములను పరిరక్షిస్తూ పూర్తిస్థాయిలో బోధన, పరిశోధన అవసరాలకు వినియోగించేలా కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.